www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
బుధవారం | 28 | అక్టోబర్ | 2026
పేజీలు : 8

విష పురుగు కాటుకు చిన్నారి మృతి





-జాతీయ రహదారిపై బంధువులు, కుటుంబ సభ్యుల ఆందోళన
-ట్రాఫిక్ జామ్

2లో..

ఆర్టీఓ కార్యాలయంలో మామూళ్ల దందా..!



- రహదారులపై తిరిగే వాహనాలకు నెలవారీ వసూళ్లు..?
-ఆన్‌లైన్ మాటున ఆఫ్‌లైన్ వ్యవహారాలు
-మామూళ్లు చెల్లించలేక ప్రజాప్రతినిధులను ఆశ్రయిస్తున్న వాహనదారులు

ప్రజాపక్షం/ఖమ్మం(బైపాస్‌రోడ్డు) : ఖమ్మం ఆర్టీఓ కార్యాలయం వాహనదారులకు రవాణా సేవలు అందించాల్సింది పోయి అక్రమ వసూళ్లలో మునిగి తేలుతోంది. రహదారులపై తిరిగే టిప్పర్లు, గ్రానైట్ లారీలు, ఇతర సరుకు రవాణా వాహనాల నుంచి నెలవారీ మామూళ్లు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. వాహనాల తనిఖీలు, ఫిట్‌నెస్ పరీక్షలు, బ్రేక్ టెస్టులు, లైసెన్సుల

మిగతా 2లో..

కరువు పరిస్థితులపై అప్రమత్తం కండి



-భూగర్భ జలాల పరిరక్షణ - తాగునీరు, విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి
-నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యతనివ్వండి
-ఉమ్మడి జిల్లా సమీక్షా సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ప్రజాపక్షం/ ఖమ్మం : ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడుతున్న కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం వానాకాలం పంటను అన్ని విధాలా కాపాడాలని, రానున్న రోజుల్లో నీటి సంరక్షణకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం చేతికందే దశలో ఉన్న పంటలను కాపాడడంతో పాటు యాసంగిలో నీటి ఆధారిత పంటలను సాగు చేయకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఈ విషయంలో ఉదాసీనంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. మంగళవారం ఖమ్మం కలెక్టరేట్‌లో ఖమ్మం కలెక్టర్ దివాకర టిఎస్, భద్రాద్రి కలెక్టర్ అంకిత్ తో కలిసి వివిధ శాఖల అధికారులతో ప్రస్తుత పరిస్థితులు, నీటి నిల్వలు, వ్యవసాయం, విద్యుత్, పశు సంవర్ధక శాఖ మొదలైన వాటిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ భూగర్భ జల మట్టం గణనీయంగా పడిపోతుందని దీనిపై

మిగతా 2లో..



కంపెనీలకు నీటి వరదలు




-ప్రజలకు గుక్కెడు నీళ్లు కరువా?
-ఎల్‌నినో ప్రభావంతో ఎండిపోతున్న జలవనరులు
-సర్వారాయ, సింగరేణిల ప్రభావంతో కరువు కోరల్లోకి సత్తుపల్లి

8లో

అర్నబ్ తుఫాన్.. తెలంగాణకు భారీ వర్షాల ముప్పు

-ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు అలర్ట్



ప్రజాపక్షం/తల్లాడ : బంగాళాఖాతంలో ఏర్పడిన అర్నబ్ తుఫాన్ తెలంగాణకు భారీ వర్షాల ముప్పును తెచ్చిపెడుతుంది. తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంలో ఈనెల 27న మంగళవారం నుంచి వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ అంచనా వేస్తుంది. ముఖ్యంగా అక్టోబర్ 28న ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు అక్కడక్కడ అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో అలర్ట్ జారీ చేసినట్లు నివేదికలు

మిగతా 2లో..



ఆర్టీఓ కార్యాలయంలో మామూళ్ల దందా..!

(మొదటిపేజీ తరువాయి)

జారీ వంటి సేవల విషయంలోనూ అక్రమ లావాదేవీలు జరుగుతన్నా యంటూ క్షేత్రస్థాయి నుంచే ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. ప్రజాపక్షం కథనంతో వెలుగులోకి వచ్చిన వ్యవహారాలు అవినీతి బండారాన్ని బట్ట బయలు చేస్తున్నాయి. ఏకంగా నెలవారీ మామూళ్ల శిబిరం నుంచే ఫోన్లు చేసి మరి వార్తకు కొనసాగింపుగా, తాజాగా క్షేత్రస్థాయి నుంచి సమాచారం అందిస్తుండటం ఈ వ్యవహారంపై మరిన్ని ప్రశ్నలను లేవనెత్తుతోంది.

టిప్పర్‌కు రూ.18వేలు, లారీకి రూ.15వేలు?

రవాణా వాహనదారుల నుంచి నెలవారీ వసూళ్లు జరుగుతున్నాయన్న ఆరోపణల ప్రకారం..ఒక్కో టిప్పర్‌కు నెలకు రూ.18వేలు,గ్రానైట్ లారీతో పాటు రోజువారీ సరుకు రవాణా చేసే వాహనాలకు రూ.15వేల చొప్పున చెల్లించాల్సి వస్తోందని సమాచారం. ఈ వసూళ్ల వ్యవహారంలో ప్రస్తుత జిల్లా అధికారి, గతంలో జిల్లా అధికారిగా పని చేసి ప్రస్తుతం సీనియర్ ఎంవీఐగా వ్యవహరిస్తున్న వారితో పాటు జూని యర్ ఎంవీఐ పేర్లు కూడా వినిపిస్తునాన్నాయి. ఒక్కోలారీకి సంబంధిం చిన నెలవారీ మొత్తాల్లో అధికారులకు, వసూళ్లను సమన్వయం చేస్తు న్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సిబ్బందికి వాటాలు అంతున్నా యన్న సమాచారం క్షేత్రస్థాయి నుంచి అందింది.

నెలవారీ చెల్లింపులు లేకుంటే రోడ్డుపైనే ఇబ్బందులా?

నెలవారీ మొత్తం చెల్లించని వాహనాలు రహదారులపై తిరిగేటప్పుడు తనిఖీల పేరుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్న ఆరోపణలు వినిపి స్తున్నాయి. ఆ నెలకు సంబంధించిన మొత్తం చెల్లించకుండా వాహనం తిరగలేదని భావించినా, రెండు, మూడు రోజుల తర్వాత తనిఖీల్లో పట్టుబడితే అధికంగా జరిమానాలు విధిస్తారన్న భయాన్ని కొందరు వాహనదారులు వ్యక్తం చేస్తున్నారంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో చెప్పనక్కర్లేదు. ఈ నేపథ్యంలో జరిమానా ఒక వేళ రూ.50వేల వరకు పడే పరిస్థితి ఉంటే దాన్ని తప్పించుకునే పేరుతో పట్టుకున్న అధి కారి రూ.30వేలు చెల్లింపులు తీసుకుని వాహనాన్ని విడిచిపెడుతు న్నార్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఒక అధికారి వద్ద నుంచి బయట పడినా, మరో అధికారి తనిఖీలో మళ్లీ అదే సమస్య ఎదురవుతోందని వాహనదారులు వాపోతున్నట్లు సమాచారం. ఈ ఆరోపణలతో తనిఖీలు అక్రమ వసూళ్లకు వేదికగా మారినట్లు అవుతందనేది స్పష్టంగా అవ గతం అవుతోంది.

కార్యాలయంలో ఆన్‌లైన్ మాటున ఆఫ్‌లైన్

రవాణా శాఖలో అనేక సేవలు ఆన్‌లైన్ విధానంలో అందుబాటులో ఉన్నప్పటికీ, కార్యాలయంలో మాత్రం అనధికారిక చెల్లింపుల వ్యవ హారం కొనసాగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. డ్రైవింగ్ లైసె న్సుల జారీ విషయంలోనూ అక్రమ వసూళ్లు జరుగుతున్నాయన్న ఫిర్యా



దులు ఉన్నాయి. ఆటోరిక్షా, కారు వంటి వాహనాలకు డ్రైవింగ్ శిక్షణ, పరీ క్షల ప్రక్రియలో నిబంధనల ప్రకారం వ్యవహరించకుండా, ఆ వాహనాలకు ఎటు వంటి ట్రైల్ లేకుండా అనధికార చెల్లింపులు తీసుకుంటున్నారన్న ఆరో పణలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా లారీలు కార్యాలయానికి తీసుకురాలేని పక్షంలో బ్రేక్ పరీక్షలు లేదా ఇతర ఫిటెనెస్ పరీక్షల కోసం చెల్లించాల్సిన మొత్తానికి అదనంగా,నెలవారీ వసూళ్ల కంటే మూడు రెట్లు వరకు డిమాండ్ చేస్తున్నారన్న సమాచారం కూడా వెలుగు లోకి వచ్చింది. అలాగే ఇతర రాష్ట్రాల్లో కొనుగోలు చేసిన వాహనాలను తెలంగాణలో రిజిస్ట్రేషన్ చేయించే ప్రక్రియలో సంబధిత అధికారిక ఫీజులకు అదనంగా రూ.50వేలకు పైగా వసూలు చేస్తున్నారన్న ఆరోప ణలు ఉన్నాయి. అయితే వాహనం రిజిస్ట్రేషన్ విధానం పన్నులు, ఇతర చట్టబద్ధమైన చార్జీల మినహాయింపు పోను మామూళ్ల ప్రక్రియలో భాగంగా తీసుకుంటున్నట్లు తెలిసింది.

మామూళ్ల భారం భరించలేక వాహనాల విక్రయం

నెలవారీ వసూళ్లు, తనిఖీల సమయంలో ఎదురవుతున్న ఇబ్బందులు, అదనపు చెల్లింపుల భారం కారణంగా కొందరు వాహన యజమానులు తమ లారీలను విక్రయించుకున్న పరిస్థితులు ఉన్నాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. రవాణా రంగంలో ఇప్పటికే ఇంధనం, నిర్వహణ, వాహన రుణాల ఈఎంఐలు, డ్రైవర్ల జీతాలు వంటి ఖర్చులతో సతమవు తున్న యజమానులకు ఇలాంటి అదనపు భారం మరింత ఇబ్బంది కంగా మారుతోందని తెలుస్తోంది. అంతేకాకుండా లారీలతో వ్యాపారం చేయలంటే బెంబేలెత్తుతున్నట్లు పేర్కొంటుండం విశేషం.

ఉన్నతాధికారులు స్పందించేనా?

రవాణా శాఖలో జరుగుతున్నాయంటూ క్షేత్రస్థాయి నుంచి వినిపిస్తున్న ఈ వ్యవహారాలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలన్న డిమాండ్ వినిపిస్తోంది. నెలవారీ వసూళ్ల ఆరోపణలు, తనిఖీల సమ యంలో అనధికార చెల్లింపులు, ఫిటెనెస్ పరీక్షలు, లైసెన్సుల జారీ, ఇతర రాష్ట్రాల వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియలను విడివిడిగా పరిశీలిం చాలని వాహనదారులు కోరుతున్నారు. అధికారిక ఫీజుల వివరాలను కార్యాలయంలో స్పష్టంగా ప్రదర్శించడం, ప్రతి చెల్లింపునకు రసీదు తప్పనిసరి చేయడం, ఫిర్యాదులపై స్వతంత్ర విచారణ జరపడం, ఆరో పణలు ఎదుర్కొంటున్న అధికారుల వివరణ తీసుకోవడం ద్వారా వాస్త వాలను వెలికితీయాల్సి అవసరం ఉంది..

అర్నబ్ తుఫాన్.. తెలంగాణకు భారీ వర్షాల ముప్పు

(మొదటిపేజీ తరువాయి)



వెల్లడించాయి. జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, సూర్యాపేట జిల్లాల్లోనూ భారీ వర్షాల పట్ల అప్రమత్తత అవసరం. అర్నబ్ అనే తుఫాన్ పేరు, దాని ఏర్పాటైన తేదీ, కదలికలు, తెలంగాణకు సంబంధించిన తేదీ భారీ వర్ష సూచనలు, వాతావరణ శాఖ తెలిపింది. ఉత్తర హిందూ మహా సముద్రానికి సంబంధించిన ప్రాంతీయ ప్రత్యేక వాతావరణ కేంద్రం, ప్రపంచ వాతావరణ సంస్థ ఆమోదించిన జాబితా ప్రకారం ప్రకటిస్తుంది. బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం బలపడి ఏర్పడిన తాజా తుఫాన్ పేరు అర్నాబ్ అని పెట్టింది. ఈ తుఫాన్‌కు అర్నాబ్ అనే పేరును బంగ్లాదేశ్ సూచించింది. బెంగాలీ భాషలో అర్నాబ్ అంటే సముద్రం అని అర్థం. ఇది అక్టోబర్ 28న ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల, వైజాగ్ మధ్య తీరం దాటే అవకాశం ఉందని భారత వాతావరణ అంచనా వేసింది దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ కోస్తా తీర ప్రాంతాలు, ఒడిశాలోని పలు జిల్లాల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో అధికారులు రెడ్, ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. రెడ్ అలర్ట్ అంటే సాధారణంగా అత్యంత భారీ వర్షాలు లేదా తీవ్రమైన వాతావరణ ప్రభావాలపై అత్యున్నత స్థాయి హెచ్చరిక అయితే రంగు ఆధారిత హెచ్చరికలు జిల్లా రోజు వర్షపాతం అంచనా ఆధారంగా మారవచ్చు. కాబట్టి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాలకు అలర్ట్ ఉందని పేర్కొనడంతో రైతులు తీవ్ర ఆందోళనకి గురవుతున్నారు.

రైతులకు కష్టకాలం :

ఇప్పటికే పంటల సాగు, పెట్టుబడుల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు తుఫాన్ మరో సవాలుగా మారే అవకాశం ఉంది. వరి కోతలు కోసిన ధాన్యం ఆరబెట్టడం, పత్తి ఏరడం, మిర్చి పంటల సంరక్షణ పనులకు వర్షాలు ఆటకం కలిగించవచ్చు. కోసిన ధాన్యం తడిస్తే నాణ్యత తగ్గి నిల్వలో సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. పత్తి తడవడం వల్ల రంగు, నాణ్యత దెబ్బతినడంతో పాటు రైతులకు గిట్టుబాటు ధర తగ్గే అవకాశం ఉంది. పొలాల్లో నీరు నిలిచిపోతే వరి, కూరగాయలు, ఇతర పంటలకు నష్టం వాటిల్లవచ్చు. భారీ వర్షాలు కురిసే ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. వాగులు, వంకలు, చెరువులు పొంగిపొర్లే అవకాశం ఉన్నందున వాటిని దాటేందుకు ప్రయత్నించకూడదు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే సమయంలో చెట్ల కింద, విద్యుత్ స్తంభాల సమీపంలో నిలవకూడదు. తెగిపడిన విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలి. వర్షాల సమయంలో అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయకపోవడం మంచిది. అధికారుల సూచనలు, వాతావరణ శాఖ తాజా హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనించాలి. రైతులు కోసిన ధాన్యం, పత్తి వీలైనంత త్వరగా సురక్షితమైన షెడ్లలోకి తరలించాలి. ఆరబెట్టిన ధాన్యాన్ని నేలపై వదిలేయకుండా బరకాలతో కప్పి కింద నీరు చేరకుండా ఏర్పాట్లు చేసుకోవాలి. పొలాల్లో నీరు నిలిచే పరిస్థితి ఉంటే స్థానిక వ్యవసాయ అధికారుల సూచనల మేరకు మురుగు నీటి కాలువలను సిద్ధం చేసుకోవాలి. పురుగుమందులు, ఎరువులను తడవకుండా భద్రపర్చాలి. వర్షం పడుతున్నప్పుడు పురుగుమందుల పిచికారి చేయకూడదు.

అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలి :

తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న జిల్లాల్లో రెవెన్యూ, వ్యవసాయ, విద్యుత్, పంచాయతీరాజ్, విపత్తు నిర్వహణ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. లోతట్టు ప్రాంతాల పరిస్థితిని పర్యవేక్షించడంతో పాటు చెరువులు, వాగుల వద్ద ప్రమాదకర పరిస్థితులు ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి. పంట నష్టం జరిగితే వెంటనే క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి వివరాలు నమోదు చేయాలి. తుఫాన్ ప్రభావం ఎంత తీవ్రంగా ఉంటుందన్నది రానున్న వాతావరణ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. ప్రజలు భయాందోళనలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలి. రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే పంట నష్టాన్ని కొంత వరకు తగ్గించుకునే అవకాశం ఉంటుంది.

కరువు పరిస్థితులపై అప్రమత్తం కండి

(మొదటిపేజీ తరువాయి)

ప్రత్యేక దృష్టి సారించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని వచ్చే జులై వరకు తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు రాకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. నవంబర్, డిసెంబర్, జనవరి మాసాల్లో వేడి మరింత పెరిగే అవకాశం ఉందని ఎప్పటికప్పుడు మీడియా సమావేశాల ద్వారా ప్రజలకు వాతావరణ పరిస్థితులను వివరిస్తూ అవగాహన కల్పించాలన్నారు. వానాకాలం పంట సాగు చేసి చేతి కందే దశలో ఉన్న దానిని కాపాడటానికి చర్యలు తీసుకోవాలని అవసరమైతే నీటి పారుదల శాఖ మంత్రితో మాట్లాడి నీటిని విడుదల చేయిస్తానని తుమ్మల హామీ ఇచ్చారు. యాసంగిలో ఎవరు నీటి ఆధారిత పంటలను సాగు చేయ కుండా చూడాల్సిన బాధ్యత వ్యవసాయ, విద్యుత్, నీటిపారుదల శాఖాధికారులపై ఉందని తొలి దశలోనే కఠినంగా వ్యవహరించాలన్నారు. పంట వ్యర్థాలకు నిప్పు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. యాసంగికి సంబంధించి పప్పు ధాన్యాలు, చిరు ధాన్యాలు, కూరగాయలు తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలని సూచించారు. ఇందుకు అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలని రైతు ఏ విత్తనం కొరితే ఆ విత్తనం అందేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఉద్యానవన పంటలకు సంబంధించి బిందు సేద్యం ఉంటేనే అనుమతి ఇవ్వాలని ఆయన తెలిపారు. ఉమ్మడి జిల్లాలో తాగునీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు అవగాహన కల్పించాలని నీటి వృథాను తగ్గించాలని అదేవిధంగా రెగ్యులే టర్లు, షట్టర్లు, పంపిణీ వ్యవస్థలను మూసివేసి కాలువల్లో నీటిని నిల్వ చేయడం ద్వారా భూగర్భ జల మట్టం పెరగడంతో పాటు తాగునీటి అవసరాలను తీరుస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతా లలో ఉన్న పాత తాగునీటి సరఫరా పథకాలను పునరుద్ధరించాలని అవసరమైతే బోర్లను రిపేర్ చేయాలని మంత్రి ఆదేశించారు. గతంలో వాడుకలో ఉండి ఇప్పుడు వృథాగా ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులను తిరిగి వినియోగంలోకి తీసుకు రావాలన్నారు. ప్రతి నీటి వనరును సద్వినియోగం చేసుకోవాలన్నారు. విబి జీరాంజీ పథకం క్రింద నీటి వనరుల పెంపుకు సంబంధించి ఇంకుడు గుంటలు, బోర్ రిచార్జ్ గుంటలు, వ్యవసాయ కుంటలు, నీటి సంరక్షణ నిర్మాణాలను చేపట్టా లని రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి ఈ నిధులకు 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని ఏడు వేల కోట్లు నిధులు ఉన్నాయని వాటిని వినియోగించుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. పశుగ్రాసం కొరత రాకుండా తగు చర్యలు తీసుకోవాలని పచ్చిగడ్డి పెంపకాన్ని ప్రోత్సహించాలని, నీటి తొట్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం, పత్తి కొనుగోళ్లపై ప్రత్యేక దృష్టిసారించాలని నిరంతర పర్యవేక్షణ అవసరం అన్నారు. అధికారులు సమర్థవంతంగా పనిచేస్తే ప్రజలకు అన్ని వసతులు సమకూరుతాయని ఆయన తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో నుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, ఉమ్మడి జిల్లా వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విష పురుగు కాటుకు చిన్నారి మృతి

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లిన బాలికకు విష పురుగు కాటు వేయ డంతో మృతి చెందిన ఘటన ఖమ్మం నగరంలో చోటు చేసుకుంది. ప్రభుత్వ పాఠశాలలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లిన అయ్యదేవర ధన్యశ్రీ (5)కి విష పురుగు కుట్టడంతో అంగన్‌వాడీ కేంద్రంలోనే అనారోగ్యానికి గురైంది. వెంటనే తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో ఖమ్మం లోని ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలించగా మంగళ వారం మృతిచెందింది. ధన్యశ్రీ తల్లిదండ్రులు రవి, స్వప్నది చింతకాని మండలం కోదుమూరు. టేదుమూరు ఓ ఇల్లు అద్దెకు తీసుకుని జీవిస్తున్నారు. రవి ఓ ప్రైవేటు దుకాణంలో కూలీగా పని చేస్తుండగా స్వప్న కూలీ పనులకు వెళ్తుంది. అంగన్‌వాడీకి పంపిన పాప ప్రాణాలు కోల్పోవ డంతో కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో దింపిన కొద్ది సేపటికే పాపకు ఒళ్లంతా దురదలు వచ్చి ఇబ్బంది పడటాన్ని ఆయా గమనించి తల్లిదండ్రులకు సమా చారం ఇచ్చింది. అంగన్‌వాడీ కేంద్రంలోని విషపురుగు కాటుకు గురైందని ధన్యశ్రీ బంధువులు బైపాస్ రోడ్డు టేడ్డు బ్రిడ్జి వద్ద ఆందోళన నిర్వహించారు. దీనితో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు ట్రాఫిక్‌ను ఖమ్మం నగరం వైపుకు మళ్లించారు. అదనపు కలెక్టర్ పి. శ్రీని వాసరెడ్డి, మహిళా శిశు సంక్షేమ అధికారి ప్రమీల ఘటన స్థలంకు చేరుకుని ధన్యశ్రీ బంధువు లతో చర్చించారు. సంబంధిత అంగన్‌వాడీ ఆయాను సస్పెండ్ చేస్తామని ధన్యశ్రీ కుటుంబానికి రెండు లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. టౌన్ ఏసిపి రమణమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు అవాంచనీయ సంఘటనలు జరగకుండా తగు చర్యలు చేపట్టారు. ఈ ఆందోళన కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు బత్తినేని నీరజ, బిఆర్ఎస్ నాయకులు పగడాల నాగరాజు, ఏఐఎ స్ఎఫ్ నాయకులు లక్ష్మణ్, మనోజ్, ఏఐవైఎఫ్ నాయకులు శ్రవణ్, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కూచిపూడి రవి, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

టిఎన్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో లంచ్ బాక్స్‌ల పంపిణి

ప్రజాపక్షం/పాల్వంచ : టిఎన్ఆర్ ట్రస్టు ద్వారా చేపడుతున్న సేవలు గొప్పవని, రాబో యే రోజుల్లో ట్రస్టు సేవలను మరింత విస్తరిం చాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్, గ్రీన్ ఎర్త్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు రమేష్ రాథోడ్‌లు అన్నారు. మండల పరిధి పాండురంగాపురం గ్రామంలో బతు కమ్మ పండుగ సంధర్భంగా బతుకమ్మ ఆడిన



మహిళలకు టిఎన్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం లంచ్ బాక్స్‌లను ట్రస్టు సభ్యులు నరాటి ప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడేందుకుప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. బతుకమ్మ తదితర పండుగలు మహిళల్లో ఐక్యతను, సామాజిక స్పూర్తిని పెంచుతాయని చెప్పారు. సమాజంలో అందరితో పాటుగా శ్రామిక వర్గాలు అభివృద్ధిలో ముందంజలో ఉండాలని ఆకాంక్షించారు. అనేక సమాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలకు విశేష సేవలను అందిస్తున్న టిఎన్ ఆర్ ట్రస్టు చైర్మన్ తాండ్ర వెంకటేశ్వరరావుకు ప్రత్యేక దన్యవాదములు తెలిపారు. ట్రస్టు సేవలతో గ్రామీణ, ప్రజలకు, మహిళలకు ప్రోత్సాహం అందించటం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, వెంకటరామయ్య, హుస్సేన్, వెంకటమ్మ, నాగేంద్ర, సీత, దీపిక, వర్షిత, శ్రీనివాస్, జల్లి శ్రీను, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్‌సి ఎన్నికల్లో సర్వోత్తమరెడ్డిని గెలిపించండి



-ఓటర్ల నమోదుపై దృష్టి సారించండి
-సన్నాహక సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : రానున్న పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమరెడ్డి విజయానికి పార్టీశ్రేణులంతా ఐక్యంగా కృషి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం వీడియోస్ కాలనీలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల సన్నాహక సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంఎల్‌సి కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థిగా రాంరెడ్డి సర్వోత్తమరెడ్డిని ఏఐసిసి, పిసిసి ఎంపిక చేయడం హర్షణీయమన్నారు. ఉన్నత విద్యావంతుడిగా విశిష్ట రాజకీయ నేపథ్యం కలిగిన వ్యక్తిగా సర్వోత్తమరెడ్డి పట్టభద్రులు, నిరుద్యోగుల సమస్యలపై సమగ్ర అవగాహన కలిగిన నేత అని కొనియాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం నియోజక వర్గ ప్రజలు తనను భారీ మెజార్టీతో గెలిపించినవిధంగానే రాబోయే ఎంఎల్‌సి ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పట్టభద్రుల ఓటర్లను కోరారు. పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియపై పార్టీ శ్రేణులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని మంత్రి సూచించారు. నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి అర్హులైన పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించాలన్నారు. ఇతర జిల్లాల కంటే మిన్నగా ఖమ్మం జిల్లాలో పార్టీ యంత్రాంగం సమన్వయంతో పనిచేసి ఎంఎల్‌సి అభ్యర్థి గెలుపే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. ఓటర్ల నమోదు ప్రక్రియ నుంచి ఎన్నికల ప్రచారం ముగిసే వరకు పక్కా కార్యాచరణతో ముందుకు సాగాలని సర్వోత్తమరెడ్డి గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. ఎంఎల్‌సి అభ్యర్థి సర్వోత్తమరెడ్డి మాట్లాడుతూ తనను గెలిపిస్తే పట్టభద్రులు, నిరుద్యోగుల సమస్యలపై శాసనమండలిలో తన వాణిని వినిపిస్తానని తెలిపారు. ప్రస్తుతం పట్టభద్రుల ఓటర్ల నమోదుపై కాంగ్రెస్ శ్రేణులు దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు రాంరెడ్డి గోపాలరెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, కాంగ్రెస్ నగర అధ్యక్షులు దీపక్ చౌదరి, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి ఖాదర్‌బాబా, ఏఎంసి చైర్మన్ యరగర్ల హన్మంతరావు, నాయకులు రాయల నాగేశ్వరరావు, మానుకొండ రాధాకిషోర్, వడ్డెబోయిన నర్సింహారావు, సాధు రమేష్‌రెడ్డి, కాంగ్రెస్ రఘునాథపాలెం మండలం అధ్యక్షులు దేవ్ సింగ్, సర్పంచులు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ప్రవళికను పరామర్శించిన రీజినల్ మేనేజర్



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : విధి నిర్వహణలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న ఆర్టిసి మహిళా కండక్టర్ ప్రవళికను టిజిఎస్ ఆర్టిసి ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎ. సరిరామ్ పరామర్శించారు. మణుగూరు డిపోకు చెందిన కండక్టర్ ప్రవళిక ఆదివారం విధి నిర్వహణలో ఉండగా ఓ మహిళా ప్రయాణికురాలు ఘర్షణ పడింది. ఈ క్రమంలో సదరు మహిళ ప్రవళికపై దాడికి దిగి బస్సులో నుంచి తోసివేసింది. ఈ ప్రమాదంలో ప్రవళిక కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. ఘటనపై సమాచారం అందుకున్న ఖమ్మం రీజినల్ మేనేజర్ సరిరామ్ తక్షణమే స్పందించి ప్రవళికకు మెరుగైన వైద్యం అందించేందుకు హైదరాబాద్‌లోని సాయి సంజీవని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ప్రవళికను మంగళవారం ఆర్ఎం సరిరామ్ పరామర్శించి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆమెకు అవసరమైన మేర అత్యుత్తమ చికిత్స అందించాలని ఎలాంటి లోటుపాట్లు రానివ్వదని వైద్యులను కోరారు. బాధిత ఉద్యోగినికి ఆర్టిసి యాజమాన్యం అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఆర్ఎం తెలిపారు. ఆర్టిసి సిబ్బందిపై ఇలాంటి దాడులు జరగడం పట్ల కార్మిక వర్గాలు, ప్రజా సంఘాలు తీవ్ర విచారం, ఆగ్రహం వ్యక్తం చేశాయి. విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులకు తగిన భద్రత కల్పించాలని, దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


గణేష్‌కు మాజీ మంత్రి నివాళి




ప్రజాపక్షం/ రఘునాథపాలెం : మండల పరిధిలోని వి. వెంకటాయపాలెం బిఆర్ఎస్ గ్రామశాఖ మాజీ అధ్యక్షులు తొలుపునూరి దానయ్య కుమారుడు గణేష్ మృతిపట్ల మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ నివాళులర్పించారు. మంగళవారం పువ్వాడ అజయ్‌కుమార్ వి. వెంకటాయపాలెం గ్రామంలో వారి స్వగృహంలో దానయ్యను పరామర్శించి కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. గణేష్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుత్తా రవి, పగడాల నాగరాజు, బత్తుల మురళీప్రసాద్, కుతుంబాక నరేష్, పోట్లపల్లి రాజా, మాధంశెట్టి హరిప్రసాద్ పాల్గొన్నారు.

శిథిలావస్థలో ముదిగొండ తహసీల్దార్ కార్యాలయం..!

- పెచ్చులూడుతున్న పైకప్పు..భయాందోళనలో రెవెన్యూ సిబ్బంది





ప్రజాపక్షం/ముదిగొండ: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. కార్యాలయ భవనం పైకప్పు నుంచి సిమెంట్ పెచ్చులు ఊడిపడుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనల మధ్య విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రజలకు నిత్యం రెవెన్యూ సేవలు అందించే కీలకమైన ప్రభుత్వ కార్యాలయ భవనం పరిస్థితి ఇలా ఉండటంపై స్థానికులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. భూ సమస్యలు, రెవెన్యూ రికార్డులు, ఇతరత్రా పనుల నిమిత్తం వివిధ గ్రామాల నుంచి ప్రజలు ఈ కార్యాలయానికి వస్తుంటారు. ఇలాంటి సమయంలో భవనం పైకప్పు నుంచి పెచ్చులు ఊడిపడటం సిబ్బందితోపాటు కార్యాలయానికి వచ్చే ప్రజలకు ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులకు సురక్షితమైన వాతావరణం కల్పించడంతోపాటు ప్రజల భద్రతకు ప్రాధాన్యమివ్వాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని పరిశీలించి, అవసరమైన మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. భవనం పరిస్థితిని నిర్లక్ష్యం చేయకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే నివారణ చర్యలు చేపట్టడం మంచిదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి భవనానికి మరమ్మతులు చేయించి, రెవెన్యూ సిబ్బంది, కార్యాలయానికి వచ్చే ప్రజలకు భద్రత కల్పించాలని కోరుతున్నారు.

ఖమ్మంరూరల్ మండల బీసీ హక్కుల సాధన సమితి

అధ్యక్షులుగా పగీళ్ల వీరభద్రం, కార్యదర్శిగా బట్ట బాబు ఏకగ్రీవ ఎన్నిక



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ ః సిపిఐ అనుబంధ సంఘమైన బీసీ హక్కుల సాధన సమితి ఖమ్మంరూరల్ మండల అధ్యక్షులుగా పగీళ్ల వీరభద్రం, కార్యదర్శిగా బట్ట బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఏదులాపురంమున్సిపాలిటీలోని గొల్లగూడెంలో నిర్వహించిన ప్రథమ మహాసభలో ఈ మేరకు నియమితులయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా చీమల దారి విశ్వానాథం, దొంతగాని వెంకన్న, నర్ర మునేష్, సహాయ కార్యదర్శులుగా గోకినపల్లి రామ్మూర్తి, లక్ష్మయ్య, మోటబోతుల రమేష్, కోశాధికారిగా గడపారపు వీరన్నతో పాటు 30మంది నూతన మండల సమితిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నూతన కమిటీకి సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమీషన్ చైర్మన్ మొహ్మద్ మౌలానా అభినందనలు తెలిపారు.

అశ్వారావుపేట మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలి

- సిపిఐ(ఎంఎల్)ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



ప్రజాపక్షం/ అశ్వారావుపేట ః భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండల కేంద్రాన్ని తక్షణమే కరువు ప్రాంతంగా ప్రకటించాలని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి గోకినపల్లి ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో అశ్వారావుపేట తహశీల్దార్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్థానిక తహశీల్దార్‌కు అందచేశారు. ఈ సందర్భంగా గోకినపల్లి ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కరువు పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయని, అశ్వారావుపేట మండలంలోనూ సగానికిపైగా భూములు సాగుకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సాగు చేసిన కొద్దిపాటి పంటలు కూడా నీళ్లు లేక ఎండిపోతున్నాయని తెలిపారు. ఈ క్లిష్ట పరిస్థితుల దృష్ట్యా మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని కోరారు. రైతులు పండించిన అన్ని రకాల పంటలకు కనీస మద్దతు ధరను నిర్ణయించి దళారీ వ్యవస్థను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా విద్యుత్ కోతల నివారణకు చర్యలు తీసుకోవాలని, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను నియంత్రించాలని తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాస్‌లైన్ మండల కార్యదర్శి వాసం బుచ్చిరాజు, కావడిగుండ్ల సర్పంచ్ బాడిస లక్ష్మణ్‌రావు, మండల కమిటీ నాయకులు ధర్మముల శ్రీరాములు, కారం మల్లేష్, కంగాల భూలక్ష్మి , నాయకులు వాసం పోతురాజు, కొమరం చిన్నలక్ష్మి , గంగమ్మ, తెల్లం సత్యం, సోడెం పాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల సంస్మరణ బైక్ ర్యాలీ



ప్రజాపక్షం/సత్తుపల్లిః పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మండల పరిదిలోని బేతుపల్లి గంగారంలోని 15వ ప్రత్యేక పోలీసు బెటాలియన్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ మంగళవారం నిర్వహించారు. బెటాలియన్ కమాండెంట్ ఎన్. పెద్దబాబు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఏజీ1 గేట్ నుంచి ప్రారంభమైన ర్యాలీ సత్తుపల్లి రింగ్ సెంటర్ వరకు కొనసాగి తిరిగి బెటాలియన్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ దేశ శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. వారి త్యాగాలను ప్రజలకు తెలియజేసి, పోలీసుల ధైర్యసాహసాలు, నిస్వార్థ సేవలపై అవగాహన కల్పించేందుకే ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు వి. వేణుగోపాల్ రెడ్డి, బి. వినాయకరావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు (ఆర్ఐలు) కె.వి. గోపాల్, పి. ఉదయకుమార్, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు (ఆర్ఎస్ఐలు) సూర్య, సాయి కుమార్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి సుధారాణి చేయూత



ప్రజాపక్షం/సత్తుపల్లిః కష్టాల్లో ఉన్న నిరుపేద కుటుంబానికి సుధ హెర్బల్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్, అనువంశిక ఆయుర్వేద వైద్యురాలు కొనకళ్ల సుధారాణి అండగా నిలిచారు. మండల పరిధిలోని గంగారం గ్రామం జలగం నగర్‌కు చెందిన ఈర్ల మురళి కి ఇన్ఫెక్షన్ కారణంగా ఒక కాలు తీసివెయ్యగా మరో కాలుకు తీవ్ర నష్టం వాటిల్లి, జీవనోపాధి కోల్పోయి దయనీయ పరిస్థితుల్లో జీవిస్తున్నాడు. అరటి పండ్లు అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషించుకునే మురళి ప్రస్తుతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఆయనను చూసుకోవడానికి తల్లి ఇంటివద్దే ఉండగా, తండ్రి కూలి పనులకు వెళ్తేనే కుటుంబానికి పూట గడిచే పరిస్థితి నెలకొంది. ఈ విషయం తెలుసుకున్న సుధారాణి మంగళవారం మురళి కుటుంబానికి నెలకు సరిపడా బియ్యం, నిత్యావసర సరుకులు అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. అనంతరం వారి ఇంటి పెరట్లో మొక్కను నాటి, మొక్కల పెంపకం ప్రాముఖ్యతతో పాటు మురళి పాటించాల్సిన ఆహార నియమాలపై అవగాహన కల్పించారు. ఆపదలో ఉన్న పేద కుటుంబానికి అండగా నిలిచిన సుధారాణిని పలువురు అభినందించారు.

ఉపాధి హామీ సదస్సును జయప్రదం చేయండి

ప్రజాపక్షం/కల్లూరుః ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకుందాం.. పట్టణ కూలీలకు ఉపాధి కల్పిద్దాం.. అనే నినాదంతో నేటి ఉదయం 10 గంటలకు కల్లూరు మార్కెట్ యార్డ్ లో జరిగే ఉపాధి హామీ సదస్సును జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బికేఎంయు ఖమ్మం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి దండు ఆదినారాయణ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నేడు జరిగే సదస్సుకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సత్తుపల్లి శాసన సభ్యురాలు మట్టా రాగమయి దయానంద్, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు భాగం హేమంతరావు, వ్యవసాయ కార్మిక, సంఘం రాష్ట్ర అధ్యక్షులు కలకొండ కాంతయ్య, సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఏఐటీయూసీ జాతీయ కౌన్సిల్ సభ్యులు శింగు నరసింహారావు, వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తాటి వెంకటేశ్వర్లు, సిద్ధినేని కరుణకుమార్ , మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఏపూరి లతా దేవి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ రాంబాబు తదితరులు హాజరవుతున్నారని వారు తెలిపారు.

పట్టభద్రుల ఓటర్ల నమోదును వేగవంతం చేయాలి



-క్షేత్రస్థాయి పనులే ఎన్నికల్లో పార్టీని గెలిపిస్తాయి
-ఓటరు నమోదు కేంద్రాలను పరిశీలించిన మాజీ మంత్రి పువ్వాడ, ఎంఎల్సీ తక్కెళ్లపల్లి



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : రాబోయే పట్టభద్రుల ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రుల ఎంఎల్సీ ఓట్ల నమోదు ప్రక్రియను బిఆర్ఎస్ శ్రేణులు ప్రతిష్టాత్మకంగా తీసుకుని వేగవంతం చేయాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఖమ్మం నగరంలోని ముస్తఫానగర్, గాంధీచౌక్, జిల్లా కోర్టు, ఎస్‌బిఐటి కళాశాలల వద్ద ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఓటర్ల నమోదు కేంద్రాలను ఎంఎల్సీ తక్కెళ్లపల్లి రవీంద్రరావుతో కలిసి మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ పట్టభద్రుల ఎంఎల్సీ ఎన్నికల నిబంధనల ప్రకారం గతంలో ఓటు ఉన్న వారు సైతం తప్పనిసరిగా మరల కొత్తగా ఓటు నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. గతంలో ఓటు ఉందన్న దీమాతో ఉండకుండా ప్రతి పట్టభద్రుడితో దరఖాస్తు చేయించే బాధ్యతను బిఆర్ఎస్ శ్రేణులు తీసుకోవాలన్నారు. గత ఎన్నికల డేటా ఆధారంగా డివిజన్లు, ఇంటి నెంబర్ల వారీగా అర్హులను గుర్తించి ఫోన్ల ద్వారా నమోదు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఫోన్లలో అందుబాటులోకి రాని వారి ఇండ్లకు వెళ్లి ఓటు నమోదు చేయించాలని సూచించారు. న్యాయవాదుల నమోదులో లీగల్ సెల్ విభాగం చొరవ చూపాలన్నారు. ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, ఇతర విద్యా సంస్థలు, నివాస ప్రాంతాల్లో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి అర్హులైన ప్రతి పట్టభద్రున్ని ఓటరుగా నమోదు చేయించాలన్నారు. 2023లో పట్టభద్రులైన వారిని నూతన అభ్యర్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఓటర్ల నమోదు గడువు మరో 10 రోజుల్లో ముగియనున్నందున ప్రతి కార్యకర్త రోజు వారి లక్ష్యాలను నిర్దేశించుకుని పని చేయాలన్నారు. మైకులు, ఉపన్యాసాల కంటే క్షేత్రస్థాయిలో చేసే పనులే ఎన్నికల్లో పార్టీ విజయానికి బాటలు వేస్తాయన్నారు. ఓటరు నమోదు ప్రక్రియను ఖమ్మం నగరంలో తానే స్వయంగా సమీక్షిస్తానని కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ పిలుపు మేరకు నాయకులంతా సమన్వయంతో పనిచేసి ఓటరు నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్జెసి కృష్ణ, బచ్చు విజయ్‌కుమార్, పగడాల నాగరాజు, కర్నాటి కృష్ణ, మగ్బూల్, రోజ్‌లీనా, నాగండ్ల కోటేశ్వరరావు, బిక్కసాని జశ్వంత్, బత్తుల మురళీ, పసుమర్తి రాంమోహన్, మెంతుల శ్రీశైలం, లీగల్ సెల్ ప్రతినిధులు బిచ్చాల తిరుమలరావు, కొత్తా వెంకటేశ్వరరావు, మేకల సుగుణారావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎంఎల్సీ ఓటరు నమోదుకు ఉచిత ఆన్‌లైన్ కేంద్రాలు

ప్రజాపక్షం/అశ్వాపల్లి: పట్టభద్రుల ఎంఎల్సీ ఓటరు నమోదును ప్రోత్సహించేందుకు బీఆర్ఎస్ నాయకులు అశ్వాపల్లి మండలంలోని మార్కోడు, అశ్వాపల్లి గ్రామాల్లో ఉచిత ఆన్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మాజీ ఎంఎల్సీ రేగా కాంతారావు పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. అర్హులైన పట్టభద్రులంతా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని మాజీ ఎంపీపీ, ఉమ్మడి గుండాల ఎంఎల్సీ ఇన్‌చార్జి కోండ్రు మంజు భార్గవి కోరారు. ఈకార్యక్రమంలో పినపాక మండల అధ్యక్షుడు, ఎంఎల్సీ నమోదు ఇన్‌చార్జి పగడాల సతీష్‌రెడ్డి, తెలంగాణ ఉద్యమకారుడు దిండిగల్ రాజేందర్, ఆళ్లపల్లి మండల అధ్యక్షుడు పాయం నరసింహారావు, మాజీ జెడ్పిటిసి కొమరం హనుమంత్, ప్రధాన కార్యదర్శి షేక్ బాబా, సహకార సంఘం చైర్మన్ గొగ్గెల రామయ్య, గొగ్గెల గోపాల్, వేమూరి రాంబాబు, తాళ్లపల్లి ఎల్లగౌడ్, కేసరి నరేష్, కంచెర్ల సందీప్, ఈశ్వరోజు అంజయ్య, అంబోజు నవీన్, చామకూరి హరీష్, కేసరి రమేష్, యువ నాయకులు ఎండి అధం, చింటూ, ఖలీద్, నమస్తే తెలంగాణ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరూ నమోదు చేసుకోవాలి



ప్రజాపక్షం/బూర్గంపాడు: ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎంఎల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా రెడ్డిపాలెం గ్రామ పంచాయితీలో ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేశారు. అర్హులైన పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవడంతో పాటు సహోద్యోగులు, పరిసర ప్రాంతాల వారికి అవగాహన కల్పించాలని నాయకులు కోరారు. ఈకార్యక్రమంలో బూర్గంపాడు మండల మాజీ జెడ్పిటిసి కామిరెడ్డి శ్రీలత, సర్పంచ్ బానోత్ సరోజ, ఉప సర్పంచ్ అప్పిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మేదగం శ్రీనివాసరెడ్డి, బిజ్జం వెంకటరామిరెడ్డి, మండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, గాదె ప్రభాకర్‌రెడ్డి, కిషోర్, చక్క నరసింహారావు, గ్రామ పెద్దలు, బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



-43 వాహనాలు గుర్తింపు, గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం
-పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్



ప్రజాపక్షం/బూర్గంపాడు: గంజాయి అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాల కట్టడే లక్ష్యంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు సారపాక సుందరయ్యనగర్‌లో మెరుపు తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం తెల్లవారుజామున చేపట్టిన తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేని 43 ద్విచక్ర వాహనాలు, ఆటోలను గుర్తించారు. డాగ్ స్క్వాడ్ బృందాలతో కలిసి పోలీసులు అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వాహనాల ధ్రువపత్రాలను పరిశీలించి నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో భాగంగా ఈ తనిఖీలు చేపట్టినట్లు వెల్లడించారు. ఈసందర్భంగా డీఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ యువత గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. గంజాయి అక్రమ రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ప్రజల సహకారంతో మాదక ద్రవ్యాల అక్రమ కార్యకలాపాల ను అరికట్టవచ్చని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనాదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని డీఎస్పీ సూచించారు. రహదారి భద్రతా నియమాలు పాటిస్తూ, తమతోపా టు ఇతరుల ప్రాణాల రక్షణకు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఈ తనిఖీల్లో పాల్వంచ సీఐ సతీష్‌కుమార్, బూర్గంపాడు ఎస్ఐ మేడ ప్రసాద్, నాగబిక్షం, మధు ప్రసాద్, పోలీసు, ప్రత్యేక బలగాల సిబ్బంది, డాగ్ స్క్వాడ్ బృందాలు సహా సుమారు 50 మంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎంఎల్సీ అభ్యర్థిని గెలిపించాలి



ప్రజాపక్షం/చండ్రుగొండ: కాంగ్రెస్ పార్టీ ఎంఎల్సీ అభ్యర్థి రామిరెడ్డి సర్వోత్తమ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టౌన్ ప్రెసిడెంట్ తుమ్మలపల్లి సురేష్ పట్టభద్రులను కోరారు. మంగళవారం చండ్రుగొండ గ్రామ పంచాయితీ పరిధిలో పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి ఓటరు నమో దుపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సురేష్ మాట్లాడుతూ అర్హులైన పట్టభద్రులంతా ఎంఎల్సీ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని, కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో పట్టభద్రుల ఓటు హక్కు కీలకమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు విస్తృతంగా పట్టభద్రులను కలిసి ఓటు అభ్యర్థించాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ అంతటి రామకృష్ణ, వార్డు సభ్యుడు ఇమ్రాన్, నాయకులు సారే పల్లి శేఖర్, కిరణ్‌రెడ్డి, అన్వర్, తదితరులు పాల్గొన్నారు.

కొమురం భీం పోరాటం చిరస్మరణీయం



ప్రజాపక్షం/జూలూరుపాడు: ఆదివాసీ గిరిజనుల ఆరాధ్య దైవం జల్ జంగల్ జమీన్ మాదే నినాదంతో నిరంకుశత్వాన్ని ధిక్కరించిన గోండు వీరుడు, అస్తిత్వ, ఆత్మగౌరవ పోరాటాలకు స్ఫూర్తి ప్రదాత కొమురం భీమ్ జయంతి సందర్భంగా ఆ విప్లవ యోధునికి. కొమురం భీం జూలూరుపాడు మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల నుంచి విచ్చేసిన ఆదివాసీ నాయకులు కొమురం భీం కు ఘనంగా నివాళులర్పించి, ఆయన చేసిన పోరాటాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆదివాసీ నాయకులు కాలం నర్సింహారావు మాట్లాడుతూ ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, అటవీ భూములపై హక్కుల సాధన కోసం కొమురం భీం చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ఆదివాసీ సమాజం విద్య, వైద్యం, ఉపాధి, సామాజిక అభివృద్ధి రంగాల్లో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కొమురం భీం ఫౌండేషన్ జూలూరుపాడు మండల కమిటీ ప్రతినిధి సొడె శ్రీరామ్ మాట్లాడుతూ జూలూరుపాడు మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం, సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొర్సా రమేష్, ఇర్పా రామారావు, మడి రవి, ఈసం నరసింహారావు, వాడే నరసింహారావు, బచ్చల మహేష్, బచ్చల అశోక్ కుమార్, సామాజిక సద్భావన ప్రముఖ్ రామి శెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎం తీరుపై పాలకవర్గం ఆగ్రహం



ప్రజాపక్షం/దుమ్ముగూడెం: దుమ్ముగూడెం మండలం పెద్దనల్లబల్లి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడి వ్యవహారశైలి, పాఠశాల నిర్వహణపై సర్పంచ్ మడకం సారక్క, గ్రామ పంచాయితీ పాలకవర్గ సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని, ప్రజాప్రతినిధుల పట్ల అవమానకరంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమం, కెన్యా ప్రతినిధుల పర్యటనకు సంబంధించి సరైన సమాచారం ఇవ్వలేదని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల హాజరు, పని వేళలు, బోధనపై అధికారులు విచారణ జరిపి విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని, తప్పులు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి పాఠశాల నిర్వహణ కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



ప్రజాపక్షం/పాల్వంచ : పాల్వంచలోని డిప్యూటి డిఎంహెచ్ఓ కార్యాలయంలో జిల్లా మెడికల్ ఆఫీసర్లకు టిబి వ్యాధిపై మంగళవారం వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సంధర్భంగా జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి తుకారాం రాథోడ్ మాట్లాడుతూ సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. టిబితో బాదపడుతున్న పిల్లలు, పెద్దలకు స్కానింగ్, స్క్రీనింగ్ చేసే విధానంపై అవగాహన కలిగించారు.జాతీయ కార్యక్రమాలైన ఇమ్యూనైజేషన్, చిన్న పిల్లల వ్యాక్సిన్, నాన్ కమ్యూనికేబుల్ డిసీజ్, ఏఎన్సీ రిజిస్ట్రేషన్‌పై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి ప్రసాద్, ఇంటిగ్రేటెడ్ టీవీ ఇండియా వెంకట్, రాజేష్, దినేష్, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఐ రఘుకి సన్మానం

ప్రజాపక్షం/మణుగూరు: పినపాక మండలం ఏడుళ్ల బయ్యారం నూతన సబ్ ఇన్ స్పెక్టర్ (ఎస్ఐ) గా ఇటీవలే బాధ్యతలు చేపట్టిన రఘును సీపీఐ పినపాక మండల కార్యదర్శి తోగటి కుమార్ నేతృత్వంలోని పార్టీ బృందం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించింది. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ రఘును ఘనంగా సత్కరించి, శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు గడ్డం మనోహరా చారి, నాయకులు వర్సా నరసింహారావు, కప్ప వెంకటేశ్వర్లు ఉన్నారు.



ఆదివాసి జేఏసి ఆధ్వర్యంలో కొమరం భీమ్ వర్ధంతి



ప్రజాపక్షం/మణుగూరు: గోండు బొబ్బిలి ఆదివాసీ అమర వీరుడు కొమరం భీమ్ 86వ వర్ధంతిని మణుగూరు ఆదివాసి జేఏసి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొమరం భీమ్ యొక్క వర్ధంతిని ఆదివాసి సమాజం స్మరించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కొమరం భీం వర్ధంతిని స్మరించుకోవడం అంటే కేవలం పూలమాలలు వేయడం కాదు, ఆయన పోరాడిన హక్కులను సాధించుకోవడానికి ఆదివాసులందరూ ఒక సంకల్పం తీసుకోవడం అని జేఏసీ నాయకులు మాట్లాడారు.

ఈ ప్రభుత్వ కార్యాలయాలకు అటెండర్లే అధికారులు..!

-విధులకు హాజరు కాని అధికారులపై ఆరోపణలు..
ప్రజల సమస్యలు పరిష్కరించేదెవరు?
-వైరాలోని నీటి సరఫరా, సహాయ గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయాలపై ఫిర్యాదులు
-జిల్లాస్థాయి అధికారులు స్పందించాలని ప్రజల విజ్ఞప్తి







ప్రజాపక్షం/వైరాः ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులే అందుబాటులో లేకపోతే సామాన్య ప్రజలు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలి? విధి నిర్వహణో భాగంగా ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన అధికారులు కార్యాలయాలకు సక్రమంగా హాజరుకావడం లేదనే ఆరోపణలు వైరాలోని కొన్ని ప్రభుత్వ కార్యాలయాలపై వినిపిస్తున్నాయి. అధికారుల స్థానంలో అటెండర్లే విధులు నిర్వహిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వైరాలోని నీటి సరఫరా విభాగం, సహాయ గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయాల్లో సంబంధిత అధికారులు తరచూ అందుబాటులో ఉండటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కార్యాలయాలకు ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళతారో తెలియని పరిస్థితి నెలకొందని, ఫోన్‌లో సంప్రదించినప్పుడు విధి నిర్వహణలో ఉన్నామని సమాధానాలు చెబుతున్నారని పలువురు పేర్కొంటున్నారు. ఈ ఆరోపణలపై ఉన్నతాధికారులు విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించాల్సిన అవసరం ఉంది.

ప్రజావాణికి కూడా అటెండర్లేనా?

ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి సైతం సంబంధిత అధికారులు కాకుండా అటెండర్లు హాజరవుతున్నారనే ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. ప్రజల నుంచి వినతుల స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుంది. అలాంటప్పుడు అధికారులు అందుబాటులో లేకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు హాజరవుతున్నారా? ప్రజల వినతులపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

కార్యాలయాల్లో ఖాళీ కుర్చీలు..వృధాగా విద్యుత్ వినియోగం!

నీటి సరఫరా విభాగం కార్యాలయంలో అధికారులు అందుబాటులో ఉండటం లేదని, కార్యాలయంలోని కుర్చీలు దుమ్ము, దూళితో నిండిపోయి ఉన్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు కార్యాలయాల్లో ఎవరూ లేకున్నా ఫ్యాన్లు తిరుగుతూ, లైట్లు వెలుగుతూ విద్యుత్ వృధా అవుతుందనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బంది హాజరు, విధుల నిర్వహణ, విద్యుత్ వినియోగంపై పర్యవేక్షణ అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు కార్యాలయాలకు హాజరు కావడంపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. హాజరు రిజిస్టర్‌లో ఒకేసారి సంతకాలు చేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ అంశాలపై అధికారిక నిర్ణయం లేదు. సంబంధిత హాజరు రిజిస్టర్లు, విధుల కేటాయింపు వివరాలు, క్షేత్ర స్థాయి పర్యటనల రికార్డులను పరిశీలిచేస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వ కారాయలయాలు ప్రజలకు సేవలు అందించేందుకు ఏర్పాటు చేసినవే తప్ప, కేవలం పేరుకే కొనసాగేందుకు కావు, ప్రజలకు అవసరమైన సమయంలో అధికారులు అందుబాటులో ఉండటం, విధులకు సక్రమంగా హాజరుకావడం, వినతులపై చర్యలు తీసుకోవడం అత్యంత ముఖ్యం. వైరాలోని సంబంధిత కార్యాలయాల పనితీరుపై జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి సారించి క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని స్థానికుల కోరుతున్నారు. అధికారుల హాజరు, ప్రజావాణికి హాజరు, హాజరు రిజిస్టర్ల నిర్వహణ, కార్యాలయాల పనితీరుపై సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

చండ్రుగొండలో 80 నాటుసారా ప్యాకెట్లు స్వాధీనం

-స్కూటీపై తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు

ప్రజాపక్షం/చండ్రుగొండ: చండ్రుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని తిప్పనపల్లి గ్రామ శివారులో నాటుసారా తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 80 నాటు సారా పాకెట్లు, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం మొహమ్మద్‌నగర్ వెళ్లే రహదారిపై పెట్రోలింగ్ నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ రామస్వామి, హోంగార్డు సురేష్ అనుమానాస్పదంగా స్కూటీపై వస్తున్న వ్యక్తిని గుర్తించారు. పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించడంతో వెంబడించి పట్టుకుని తనిఖీ చేశారు. అతని వద్ద ఉన్న సంచిలో 80 నాటుసారా పాకెట్లు లభించాయి. ఒక్కో పాకెట్‌ను రూ 40 చొప్పున విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న పాకెట్ల విలువ సుమారు రూ 3,200గా పేర్కొన్నారు. నాటుసారాతో పాటు టీఎస్ 04ఎఫ్ఎల్0660 నంబర్ గల హోండా స్కూటీని స్వాధీనం చేసుకుని, నిందితుడిపై చట్టపరమైన చర్యలు చేపట్టారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి



ప్రజాపక్షం/ఆళ్లపల్లి: మర్కోడు గ్రామంలో విషాద ఘటన చోటు చేసుకుంది. మంగళవారం ఉదయం 10గంటల సమయంలో కల్లు తీసేందుకు తాటి చెట్టుపైకి ఎక్కిన గీత కార్మికుడు కోతి యాదగిరి(60)ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందాడు. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకోగా, కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

కాలువల పునరుద్ధరణకు రూ. 14లక్షలు



ప్రజాపక్షం/కూసుమంచి: మండలంలోని సాగునీటి కాలువల నిర్వహణను మెరుగుపరిచేందుకు నీటిపారుదల శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా నాయకన్‌గూడెం ఇన్‌ఫాల్ నుంచి రామచంద్రపురం బ్రిడ్జి వరకు సుమారు 2.5కిలో మీటర్ల మేర కాలువకు ఇరువైపులా పునరుద్ధరణ పనులు ప్రారంభించారు. ఈపనులను రూ 14లక్షల వ్యయంతో చేపడుతున్నట్లు ఐబీ(నీటిపారుదల)శాఖ ఏఈ మీనా తెలిపారు. కాలువకు ఇరువైపులా దెబ్బతిన్న ప్రాంతాలను బాగు చేయడం, గుంతలను పూడ్చడం, అవసరమైన మరమ్మతులు చేపట్టడం వంటి పనులను అప్రమత్తం కొనసాగిస్తున్నారు, కాలువ గట్ల పరిస్థితిని మెరుగుపరిచి, వాటి నిర్వహణకు పటిష్టంగా చేయడమే ఈ పనుల ప్రధాన ఉద్దేశమని అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయని, సుమారు నెలల రోజుల్లో వాటిని పూర్తి చేయనున్నట్లు ఏఈ మీనా వెల్లడించారు. ఖమ్మం సబ్ డివిజన్ పరిధిలో సెక్షన్ 1, డివిజన్ 2, సబ్ డివిజన్ 3కు సంప్రదించిన అధికారుల పర్యవేక్షణలో ఈ పనులు జరుగుతున్నట్లు తెలిపారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఐటీడీఏ అధికారుల ఆకస్మిక తనిఖీ

-విద్యా బోధన, విద్యార్థుల అభ్యసన స్థాయిపై సమీక్ష







ప్రజాపక్షం/బూర్గంపాడు: బూర్గంపాడు మండలం ఉప్పుసాక గిరిజన ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ చందన, భద్రాచలం ఏటీడీఓ రాధ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం, వసతి గృహాల్లో పరిశుభ్రత పాటించడంపై ప్రత్యేక దృష్టి సారించారు. తొలుత ప్రాథమిక పాఠశాల విద్యార్థుల అభ్యసన స్థాయిని పరిశీలించి ప్రశ్నలు అడిగారు. విద్యార్థులు సరైన సమాధానాలు చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల కాలపట్టికలు, ఉపాధ్యాయుల డైరీలు, కంప్యూటర్ ప్రయోగశాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నిరంతర శిక్షణ అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రధానోపాధ్యాయులు బి పిచ్చయ్యకు పాఠశాలకు సంబంధించిన పలు అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వసతి గృహాన్ని పరిశీలించి, నిల్వ గది శుభ్రంగా, క్రమబద్ధంగా ఉండటంపై వార్డెన్ బి రాములును అభినందించారు. పాఠశాల, వసతి గృహాల్లో పరిశుభ్రతను ప్రాధాన్యమిస్తూ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సూచించారుఎ. ఈ తనిఖీలో ప్రధానోపాధ్యాయులు బి పిచ్చయ్య, సీనియర్ ఉపాధ్యాయులు బి భీమా, బి ప్రసాదరావు, బీవీ, రాజేష్, జి భద్రు, జి రాములు, టీ విజయ, బి విజయ, వార్డెన్ బి రాములు, రవి, వెంకట్, ధర్మరాజు, నరసింహారావు, కిషన్, రమేష్, గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరవధిక సమ్మె



ప్రజాపక్షం/దుమ్ముగూడెం: జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్‌ఎం)కింద పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ జేఏసీ పిలుపు మేరకు వైద్య ఉద్యోగులు నిరవధిక సమ్మెకు సిద్ధమయ్యారు. ఈ మేరకు నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇన్‌చార్జి హెల్త్ సూపర్‌వైజర్ రామ్‌బాయ్‌కు సమ్మె నోటీసు అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్‌హెచ్‌ఎం కింద పని చేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట శాంతియుతంగా ధర్నా నిర్వహించారు. ఈకార్యక్రమంలో జిల్లా ఆయుష్ ఎస్ఎన్‌వోల సంఘం నాయకుడు వీరభద్రం కందుల, రెండో ఏఎన్ఎంలు పూర్ణ, పద్మ, విజయ, తిరుపతమ్మ, స్టాఫ్ నర్స్ భారతి, తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదుకు ఇంటింటి ప్రచారం



ప్రజాపక్షం/ఇల్లందు: ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సీ ఎన్నికల నేపథ్యంలో ఇల్లందు మున్సిపాలిటీలోని 22వ వార్డులో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి సర్వోత్తమరెడ్డికి మద్దతుగా పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కౌన్సిలర్ కొర్లపాటి శివకిరణ్ ఆధ్వర్యంలో సోమవారం వార్డులో ఇంటింటికీ తిరిగి అర్హులైన పట్టభద్రుల వివరాలు సేకరించారు. ఈసందర్భంగా కౌన్సిలర్ కొర్లపాటి శివకిరణ్, పట్టణ అధ్యక్షుడు బోళ్ల సూర్యం మాట్లాడుతూ విద్య, ఉపాధి, నిరుద్యోగ సమస్యలపై శాసన మండలిలో గళం వినిపించే సర్వోత్తమరెడ్డి గెలుపునకు కృషి చేస్తున్నామని తెలిపారు. 22వ వార్డులో అర్హులైన ప్రతి పట్టభద్రుడి ఓటు నమోదు చేయడమే లక్ష్యమన్నారు. ఈకార్యక్రమంలో ఆలేటి చిన్ని, కొలపురి ఝాన్సీ, పొట్ల శ్రీను, సతీష్ కుమార్ పాసి, రమేష్ గౌడ్, ప్రసాద్ నాయక్, గాడిపల్లి భగత్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

50శాతం రాయితీపై వేరుశనగ విత్తనాల పంపిణీ



ప్రజాపక్షం/కూసుమంచి: కూసుమంచి మండల రైతు వేదికలో ఎన్ఎంఈఓ ఓఎస్ పథకం కింద రైతులకు 50శాతం రాయితీపై వేరుశనగ విత్తనాలను మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి పంపిణీ చేశారు. రైతులను వేరుశనగ సాగు వైపు ప్రోత్సహించి నూనెగింజల ఉత్పత్తిని పెంచడమే లక్ష్యమని తెలిపారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

- మేయర్ మూడ్ గణేష్



ప్రజాపక్షం/పాల్వంచ : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయమని కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ మేయర్ మూడ్ గణేష్ అన్నారు. పాల్వంచ డివిజన్ బిసిఎం రోడ్ నుండి నాలుగు డివిజన్‌లకు వెళ్ళే ప్రధాన రహదారిలో జరుగుతున్న డ్రైనేజి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సంధర్భంగా కాలనీలకు చెందిన ప్రజలు విద్యుత్ స్థంభాలు ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందించారు. వెంటనే స్పందించి మేయర్ విద్యుత్ అధికారులతో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. దీనితో సంభంధిత అధికారులు 11 స్థంభాల ఏర్పాటు పనులను ప్రారంభించారు. దీనితో కాంట్రాక్టర్స్ కాలని, బాపూజినగర్, ఏడవ, 42వ, డివిజన్ ప్రజలకు సౌకర్యంగా మారుతుంది. ఈ సంధర్భంగా మేయర్ మాట్లాడుతూ స్థానిక ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు సహకారంతో కొత్తగూడెం కార్పోరేషన్‌ను అభివృద్ధి చేసుకొందామన్నారు. ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. అందరం చేయీ చేయీ కలిపి పాల్వంచను అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు పాటుపడదామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఆలపాటి ప్రసాద్, డివిజన్ ప్రజలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదు వేగవంతం చేయాలి



ప్రజాపక్షం/వైరా : ఎమ్మెల్సీ ఓటు నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని వైరా నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బాణోత్ చంద్రావతి అన్నారు. వైరా పట్టణంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆమె జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జున్‌రావుతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును పట్టభద్రులు వినియోగించుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఎద్దునూరి శ్రీను, మద్దెల రవి, బాణోత్ సక్కుబాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక యంత్రంతో గుర్రపుడెక్క తొలగింపునకు చర్యలు



-ధంసలాపురం చెరువును పరిశీలించిన కలెక్టర్



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ధంసలాపురం చెరువులో విస్తరించిన గుర్రపుడెక్క మొక్కలను ప్రత్యేక యంత్రం ద్వారా తొలగింపుకు చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. మంగళవారం ధంసలాపురం చెరువులో గుర్రపుడెక్క తొలగింపు పనులను కలెక్టర్ దివాకర టిఎస్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చెరువులో నీటి ఉపరితలంపై పెద్ద ఎత్తున విస్తరించిన గుర్రపుడెక్క, ఇతర జల కలుపు మొక్కలను తొలగించేందుకు ఆక్వాటిక్ వీడ్ హార్వెస్టర్ అనే ప్రత్యేక యంత్రాన్ని వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఈ యంత్రం ద్వారా గుర్రపుడెక్క తొలగింపు ప్రక్రియ వేగవంతంగా సాగడంతో పాటు మానవ శ్రమ కూడా తగ్గుతుందన్నారు. గుర్రపుడెక్క అధికంగా విస్తరించడం వల్ల నీటిలో ఆక్సిజన్ స్థాయిలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. గుర్రపుడెక్కను తొలగించడం ద్వారా నీటి పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు జల వనరులను పరిశుభ్రంగా ఉంచేందుకు అవకాశం ఉంటుందన్నారు. అధికారులు పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ గుర్రపుడెక్క తొలగింపు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ సహాయ సంచాలకులు ఎ. మల్లేశం, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ జయచందర్, కార్పొరేషన్ డిఈ నవ్య జ్యోతి, అధికారులు పాల్గొన్నారు.

అర్హులైన పట్టభద్రులందరూ ఓటు నమోదు చేసుకోవాలి



వైరా మున్సిపల్ చైర్‌పర్సన్ కాపా చంద్రకళ

ప్రజాపక్షం/వైరా : పట్టభద్రులందరు ఎమ్ఎల్సీ ఓటు నమోదు చేసుకోవాలని వైరా మున్సిపల్ చైర్‌పర్సన్ కాపా చంద్రకళమురళీకృష్ణ అన్నారు. వైరా మున్సిపాలిటీ పరిదిలోని కాంగ్రేస్‌పార్టీ కార్యాలయంలో పల్లిపాడు, సోమవరం క్లస్టర్‌లలో వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్ఎల్సీ ఓటరు నమోదు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైరా ఇంచార్జ్ వేమిరెడ్డి శ్రీనివాస్, వైరా పట్టణ కాంగ్రేస్ అధ్యక్షులు వీరంశెట్టి సీతారాములు, మండల కాంగ్రేస్ అధ్యక్షులు శీలం చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా కాంగ్రేస్ నాయకులు రాంపూడి రోశయ్య, మార్కెట్ కమిటి చైర్మన్ బోళ్ల గంగారావు, జిల్లా కాంగ్రేస్ అధికార ప్రతి నిధి పమ్మి అశోక్, కౌన్సిలర్లు మొరు శ్రీకాంత్, రాచబంటి బలరామయ్య, బత్తుల సుమతి, పొదిల హరినాధ్, కొల్లి రమేష్; కార్నాటి హనుమంతురావు, పువ్వాళ్ల రాము, తోటకూర శ్రీకాంత్, మార్కెట్ కమిటి డైరెక్టర్ జాలాది తిరుపతిరావు, నారపోగు రవి, మేరుగు వెంకటి, సత్యనారాయణ, వీరయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండే కబడ్డీ పోటీల జాతర

ఎమ్మెల్యే మట్టా రాగమయికి మువ్వా విజయబాబు ఆహ్వానం
క్రీడా సామగ్రికి ఆయుధ పూజ





ప్రజాపక్షం/సత్తుపల్లిః మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదినం సందర్భంగా, మాజీ టిజి ఐడిసి చైర్మన్ మువ్వా విజయబాబు ఆధ్వర్యంలో నిర్వహించనున్న కబడ్డి పోటీల జాతర నేటి నుండి ప్రారంభం కానుంది. 73వ రాష్ట్రస్థాయి సీనియర్ మహిళల కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతుండగా, ఈ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌ను మువ్వా విజయబాబు మంగళవారం ఆహ్వానించారు. టోర్నమెంట్ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ కబడ్డీ క్రీడా సామగ్రికి సాంప్రదాయ మహిళా క్రీడాకారిణులను ప్రోత్సహించడం, రాష్ట్రంలో కబడ్డీ క్రీడాభివృద్ధికి తోడ్పడటమే లక్ష్యంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అక్టోబర్ 28, 29, 30 తేదీల్లో వేంసూరు రోడ్డులోని రాణి సెలబ్రేషన్స్‌లో పోటీలు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గాదే చెన్నారావు, కటికాల క్రిస్టఫర్ బాబు, కె. స్వాతిముత్యం, చి. సుధాకర్, పట్టణ కౌన్సిలర్లు, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటి శ్రీనన్న జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిద్దాం



ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం ః పాలేరు నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత, ప్రజల ఆశాదీపం, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి(శ్రీనన్న) జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని తిరుమలాయపాలెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎంపిపి కొప్పుల అశోక్ పిలుపునిచ్చారు. ఈ నెల 28న తిరుమలాయపాలెం మండల కేంద్రంలో కేక్ కటింగ్‌తో పాటు పలు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కొప్పుల అశోక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి ప్రస్థానంలో కీలక పాత్ర పోషిస్తూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న తమ ప్రియతమ నాయకుడు శ్రీనన్న జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సమక్షంలో ఉత్సాహభరితంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ వేడుకలను పార్టీశ్రేణుల ఐక్యతకు, నాయకుడిపై ఉన్న అభిమానానికి ప్రతీకగా నిలిపేలా ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ నెల 28న బుధవారం ఉదయం 11గంటలకు తిరుమలాయపాలెం మండల కేంద్రంలో జన్మదిన వేడుకలు, కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, ముఖ్య కార్యకర్తలు, యువజన నాయకులు, పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి.. క్రీడలకు దగ్గరవ్వాలి : సిఐ



ప్రజాపక్షం/దుమ్ముగూడెం: యువత మాదకద్రవ్యాలకు బానిసలు కాకుండా క్రీడలు, చదువు, ఆరోగ్యకరమైన జీవనశైలికి ప్రాధాన్యమివ్వాలని దుమ్ముగూడెం సీఐ వెంకటప్పయ్య సూచించారు. డ్రగ్స్ వ్యతిరేక అవగాహనలో భాగంగా అక్టోబర్ 27న స్థానిక ఇండోర్ స్టేడియంలో పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు జగన్ మోహన్ చారి, శ్యామ్ ప్రసాద్, పోలీసు సిబ్బంది, స్థానిక యువత, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బ్యాడ్మింటన్ ఆడారు. పోటీల్లో పాల్గొన్న వారికి ట్రోఫీలు అందజేశారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు.

వెంచర్‌లో విద్యుత్ వైర్లు చోరీ



ప్రజాపక్షం/ రఘునాథపాలెం : ప్రభుత్వ అనుమతి పొందిన ఓ వెంచర్‌లో నాలుగు లక్షల విలువైన విద్యుత్ తీగలు చోరీ చేసిన సంఘటన మండల పరిధిలోని రఘునాథపాలెం రెవెన్యూ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... రఘునాథపాలెం మండలం కోయచలక క్రాస్ రోడ్డులో ప్రభుత్వ అనుమతితో ఏర్పాటు చేసిన వెంకటేశ్వర ఎస్టేట్ వెంచర్ నందు సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వెంచర్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాల నుంచి విద్యుత్ తీగలను చోరీ చేశారు. దీని విలువ సుమారు నాలుగు లక్షలు ఉంటుందని వెంచర్ నిర్వహకులు తెలిపారు. ప్రభుత్వ అధీనంలో ఉన్న వెంచర్‌లో విద్యుత్ సామగ్రి మాయం కావడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఎవరైనా చోరీ చేశారా లేదా అక్రమంగా తరలించారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వెంచర్‌లో విద్యుత్ తీగలను గుర్తించి విద్యుత్ సౌకర్యాన్ని పునరుద్ధరించాలని కోరుతున్నారు. దీనికి సంబంధించి రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఎంపిపోలు, కార్యదర్శులు స్థానికంగా అందుబాటులో ఉండాలి

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : అర్నాబ్ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలోని ఎంపిపోలు, పంచాయతీ కార్యదర్శులు స్థానిక కేంద్రాల్లో అందుబాటులో ఉంటూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి జి. వినోద్‌కుమార్ ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఎవరికి సెలవులు అనుమతించబడవన్నారు. లోతట్టు ప్రాంతాలు, పాత మట్టి ఇండ్లలో నివసిస్తున్న ప్రజలను గుర్తించి అవసరమైన సందర్భాలలో ముందస్తుగా సురక్షిత భవనాలకు తరలించాలని సూచించారు. పారిశుధ్యం, తాగునీటి భద్రతకు ప్రాధాన్యతనివ్వాలని, తాగునీటి ట్యాంకులను సూపర్ క్లోరినేషన్ చేయించాలన్నారు. లైన్ డిపార్ట్‌మెంట్లతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన సహాయ సహకారాలను అందించాలన్నారు. ఎటువంటి అత్యవసర పరిస్థితి ఎదురైన వెంటనే కంట్రోల్ రూముకు సమాచారం అందించాలని జిల్లా పంచాయతీ అధికారి తెలిపారు.

పట్టభద్రుల ఓటరు నమోదుపై జనసేన వినతి



ప్రజాపక్షం/ముదిగొండ: ఖమ్మంనల్గొండవరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం ముదిగొండ మండల తహసీల్దార్ రవికుమార్‌ను జనసేన పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు ఖమ్మంనల్గొండవరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ, ఓటరు నమోదు ప్రక్రియ తదితర అంశాలపై తహసీల్దార్‌తో చర్చించారు. అర్హత కలిగిన పట్టభద్రులెవరూ ఓటరు నమోదుకు దూరం కాకుండా అవగాహన కల్పించాలని, వారు తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకునేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దానితో పాటు మండల పరిధిలోని ప్రజలు ఎదుర్కొంటున్న పలు స్థానిక సమస్యలను తహసీల్దార్ రవికుమార్ దృష్టికి తీసుకెళ్లారు.

సేవారత్న అవార్డుకు సత్తుపల్లి వాసి ఎంపిక



ప్రజాపక్షం/సత్తుపల్లిః విశ్వజనని ఫౌండేషన్ అందించే 2026 సేవారత్న అవార్డుకు సత్తుపల్లి పట్టణానికి చెందిన పోలిశెట్టి శివకుమార్ ఎంపికయ్యారు. గత 18 ఏళ్లుగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్, ఆర్యవైశ్య సంఘం ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు అంతిమ సంస్కారాల నిర్వహణలో ఆయన విశేష సేవలందిస్తున్నారు. డిసెంబర్ 20న నరసరావుపేటలో జరిగే విశ్వజనని ఫౌండేషన్ వార్షికోత్సవంలో ఈ అవార్డును ప్రధానం చేయనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ బొగ్గారపు బ్రహ్మానందం, సభ్యుడు మాడా ఉమామహేశ్వరరావు తెలిపారు. అవార్డుకు ఎంపిక కావడం పట్ల శివకుమార్ సంతోషం వ్యక్తం చేస్తూ, తనకు సహకరించిన మిత్రులు, ఆర్యవైశ్య పెద్దలు, పట్టణ ప్రముఖులకు కృతజ్ఞతలు తెలిపారు.

రాకేష్‌రెడ్డిని గెలిపించాలి



ప్రజాపక్షం/ అశ్వారావుపేట ః త్వరలో జరుగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డిని గెలిపించాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి తక్కిసపల్లి రవీందర్ కోరారు. మంగళవారం అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో మార్నింగ్ వాకర్స్‌తో మాటామంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి నల్గొండ ఎమ్మెల్సీ ఓటర్ల ఎన్రోల్మెంట్‌లో భాగంగా 2023 అక్టోబర్ నాటికి డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్క పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటును ఎన్రోల్మెంట్ చేయించుకోవాలని తెలిపారు. అలాగే కేసిఆర్ సారధ్యంలో మెచ్చా నాగేశ్వరరావు నాయకత్వంలో జరిగిన అభివృద్ధిని వారికి తెలపాలని, రాబోయే పట్టభద్రుల ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డికి తమ మద్దతును ఇవ్వాలని కోరారు. 2028 ఎన్నికల్లో బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, కేసిఆర్ సారధ్యంలో అశ్వారావుపేటని మరింత అభివృద్ధి చేసుకుందామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల కో ఆర్డినేటర్ జూపల్లి రమణరావు, మాజీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు సుంక ప్రసాద్, మండల నాయకులు మందపాటి మోహన్‌రెడ్డి, రావు జోగేశ్వరరావు, కలపాల సురేష్, సాథు, రెహ్మాన్, ఉస్మాన్, బన్ను తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి



ప్రజాపక్షం/చుంచుపల్లిః
హైదరాబాద్‌లోని ముఖ్దూం భవన్‌లో ఈ నెల 26, 27 తేదీల్లో జరిగిన సీపీఐ రాష్ట్ర కార్యవర్గ, కౌన్సిల్ సమావేశాల్లో రాష్ట్రం లోని ప్రజలు, రైతులు, కార్మికులు ఎదు ర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించి పలు కీలక తీర్మానాలు చేసినట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సీపీఐ కార్య దర్శి ఎస్‌కే సాబీర్ పాషా, తెలంగాణ రాష్ట్ర కంట్రోల్ కౌన్సిల్ సభ్యులు మిరి యాల రంగయ్య మంగళవారం ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో నెల కొన్న కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థకు కొత్త బొగ్గు బ్లాకులను కేటాయించి, వాటిని సంస్థ ఆధ్వర్యం లోనే అభివృద్ధి చేయాలని, బొగ్గు ఉత్పత్తిని సింగరేణి కార్మికులతోనే చేప ట్టాలని కోరారు. ప్రస్తుత పరిస్థితుల్లో సింగరేణిలో ఎన్నికలు నిర్వహిం చడం సమంజసం కాదని సమావేశం అభిప్రాయపడిందన్నారు. జిల్లాలో పార్టీని బలోపేతం చేసేందుకు డిసెంబర్ 31లోగా 15 వేల పార్టీ సభ్యత్వాలను నమోదు చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, తెలంగాణ రాష్ట్ర కంట్రోల్ కౌన్సిల్ సభ్యులు మిరియాల రంగయ్య



పారు. తొలిసారిగా ఆన్‌లైన్ విధానంలో సభ్యత్వ నమోదు చేపట్టనున్నట్లు పేర్కొ న్నారు. డిసెంబర్ 27, 28, 29 తేదీల్లో ఖమ్మంలో రాష్ట్ర మహిళా సమాఖ్య సమా వేశాలు నిర్వహించనున్నట్లు జనవరి మూడో వారంలో భద్రాచలంలో అఖిల భారత ఆదివాసీ మహాసభ నిర్వహించేం దుకు నిర్ణయించినట్లు వెల్లడించారు. నవంబర్ 1న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. సీతారామ ప్రాజెక్టును ఎల్లందు సమీపంలోని రోళ్లపాడు ప్రాంతానికి అనుసంధానించాలని, నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించి ప్రజలపై భారాన్ని తగ్గించా లని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం, కార్మికుల హక్కుల పరిరక్షణ, ఆదివాసీల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి లక్ష్యంగా రానున్న రోజుల్లో ప్రజా ఉద్యమాలను మరింత విస్తృతం చేస్తామని తెలిపారు.

ప్రైవేటు బస్సు నిర్లక్ష్యం

- లగేజ్ బాక్స్ డోర్ తగిలి ఒకరు మృతి



ప్రజాపక్షం/పాల్వంచ : ఓ ప్రవేటు బస్ నిర్లక్ష్యంతో ఓ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. తెరిచి ఉన్న బస్ లగేజీ బాక్స్ డోర్ తగిలి రహదారి పక్కన బైక్‌పై కూర్చున్న వ్యక్తి మృతిచెందిన సంఘటన మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన ప్రకారం పాల్వంచ నవభారత్‌కు చెందిన సింగరేణి ఉద్యోగి సతీష్‌రెడ్డి (40) ఉదయం టీ తాగటానికి నవభారత్ సెంటర్‌కు వచ్చాడు. తిరిగి వెళ్ళేందుకు తన బైక్‌పై కూర్చున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్ నుండి భద్రాచలం వైపునకు వేగంగా వెళుతున్న బిఎస్‌ఆర్ ప్రవేటు ట్రావెల్ బస్‌కు చెందిన తెరిచి ఉన్న లగేజి బాక్స్ డోర్ ఒక్కసారిగా సతీష్‌రెడ్డి తలకు బలంగా తాకింది. దీనితో సతీష్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి చేరుకొన్న పోలీసులు మృతదేహాన్ని పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మంత్రి పొంగులేటి జన్మదినం సందర్భంగా భారీ రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలి



ప్రజాపక్షం/కూసుమంచి: మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని కూసుమంచిలోని ఎంఎల్‌పి క్యాంపు కార్యాలయంలో నిర్వహించనున్న భారీ రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ నాయకుడు కొక్కిరేణి రమేష్ కోరారు. వేడుకల్లో భాగంగా బైక్ ర్యాలీ కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. రక్తదానం ద్వారా ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడవచ్చని, యువత సామాజిక బాధ్యతగా ముందుకు రావాలని రమేష్ పిలుపునిచ్చారు. కూసుమంచి మండల ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మంత్రి అభిమానులు రక్తదాన శిబిరానికి చేరుకుని, బైక్ ర్యాలీలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

ఏవి నర్సిరెడ్డికి ఎల్ఐసి పెర్ఫార్మెన్ అవార్డు



ప్రజాపక్షం/మధిరః ఎల్ఐసి ఆఫ్ ఇండియా వరంగల్ డివిజన్ ఆఫీ స్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన ఏజెంట్లను ప్రోత్సహించడానికి, సత్కరించడానికి సౌత్ సెంట్రల్ జోన్ రీజిన్ మేనేజర్ మార్కెటింగ్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవార్డుల ప్రధానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్ఐసి ఆఫ్ ఇండియా సౌత్ సెంట్రల్ జోన్ మార్కె టింగ్ రీజినల్ మేనేజర్ రవికుమార్ మధిర ఎల్ఐసి బ్రాంచ్ నుండి ఏవి నర్సిరెడ్డిని సన్మానించి అవార్డు ప్రధానం చేశారు. ఈ సమావేశంలో వరంగల్ డివిజన్ సీని యర్ డివిజన్ మేనేజర్ జై కిసాన్, వరంగల్ మార్కెటింగ్ మేనేజర్ గోపాలకృష్ణ, ఎంఎస్.రాకేష్ కన్నా, డివిజన్ స్టాఫ్, ఎల్ఐసి ఏజెంట్లు పాల్గొన్నారు.

అర్నబ్ తుఫాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ప్రజాపక్షం/మధిరః అర్నబ్ తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందు, ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఐఏఎస్ ఆదేశాల మేరకు మధిర మున్సిపాలిటీ పరిధిలో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమీషన్ కె.శామ్యూల్, బెనెడిక్ట్ ఇస్రా యెల్‌పాల్ తెలిపారు. లోతట్టు ప్రాంతాలైన హనుమాన్ కాలనీ, ముస్లీం కాలనీ, లడక్ బజార్ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూ చించారు. అవసరమైన సందర్భాల్లో ప్రజలను సురక్షిత ప్రాం తాలకు తరలించేందుకు పునరావాస కేంద్రాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది డ్రైనేజీల్లో అడ్డంకులను తొలగించి వర్షపు నీరు సజావుగా ప్రవహించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

మున్సిపల్ కమీషనర్ కె.శామ్యూల్‌పాల్

ఇంజనీరింగ్ సిబ్బంది తాగునీటి పైప్‌లైన్‌లకు నష్టం వాటిల్లితే వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, భోజనం, ఇతర ప్రాథమిక వసతులు అందుబాటులో ఉండే లా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశా రు. అంగన్‌వాడీ సిబ్బంది, మెప్మా ఆర్పీలు ద్వారా ప్రజలకు తుఫాన్ జాగ్రత్తలపై అవగాహన కల్పించి, అవసరమైన వారిని పునరావాస కేంద్రాలకు తరలించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అత్యవ సరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని, విద్యుత్ స్థంభా లు, తెగిపడిన విద్యుత్ తీగలు, చెట్లకు దూరంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరితే వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూ చించారు. అత్యవసర సహాయం కోసం మున్సిపల్ ఎమెర్జెన్సీ కంట్రోల్ రూమ్ 9963922344, 8374856402ను, విద్యుత్ శాఖలో టోల్‌ఫ్రీ నెంబర్ 1912 సంప్రదించాలన్నారు. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి అవసరమైన సహాయక చర్యలు చేపడుతున్నారని కమీషనర్ తెలిపారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు శ్రీనిధి విద్యార్థులు



ప్రజాపక్షం/మధిరః రాష్ట్రస్థాయి అండర్16 కబడ్డీ ఎంపికల్లో శ్రీనిధి పాఠశాల విద్యార్థులు మారీదు యోగి, సయ్యద్ అహ్మద్, కూరాకుల జస్వంత్, ఉత్తమ ప్రతిభ కనబరిచిన రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక య్యారు. ఈ విద్యార్థులు 36వ తెలంగాణ రాష్ట్ర సబ్‌జూనియర్ కబడ్డీ చాంపియన్‌షిప్‌లో ఖమ్మం జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించను న్నారు. ఈ సందర్భంగాపాఠశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ బి.అంజన్‌బాబు, డైరెక్టర్ సిహెచ్.చందు, ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు, పిడి ప్రవీణ్‌కు మార్,పిఈటి శివ విద్యార్థులను అభినందించారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో పాఠ శాలకు గుర్తింపు తీసుకురావడం గర్వకారణమని వారు పేర్కొన్నారు. విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యా ర్థుల ప్రతిభను వెలికితీయడంలో క్రీడలు కీలకపాత్ర పోషిస్తాయని, భవిష్యత్తులో మరిన్ని విజ యాలు సాధించేలా పాఠశాల యాజమాన్యం ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు.

వీబీజీ రాంజీని సద్వినియోగం చేసుకోవాలి



ప్రజాపక్షం/నేలకొండపల్లి : వీబీజీ రాంజీ పథకం ను ప్రజలు సద్వినియోగం చేసుకోవా లని రాయగూడెం సర్పంచ్ బోయిన వేణు సూచించారు. మండలం లోని రాయగూడెం లో మంగళవారం వీబీజీ రాంజీ పథకం పను లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడారు. ఈ పథకం ద్వారా గ్రామం లో ఉపాధి అవకాశాలు, మౌళిక వసతులు మెరుగుపడుతాయని అన్నారు. వలసలు వెళ్ల కుండా సొంత గ్రామంలోనే ఉపాధి కల్పిస్తు న్నట్లు పేర్కొన్నారు. పనికి తగ్గ వేతనాలు అందేందుకు అధికారులు చర్యలు తీసుకోవా లని సూచించారు. పన్ని అడిగిన ప్రతీ ఒక్కరికి లేదనకుండా పనులు కల్పించాలని సూచిం చారు. ఇటు ఉపాధి పనుల కల్పన కాకుం డానే అటు రైతులకు ప్రయోజనం కలుగు తుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచా యతీ ఉప సర్పంచ్ సూరేపల్లి ప్రేమ కుమార్. పంచాయతీ కార్యదర్శి పి.హనుమంతరావు, గ్రామ పెద్దలు ఇరగదిండ్ల నాగరాజు, బోయిన నరసింహారావు, కోసూరి పానకాలు, వెన్నబోయిన కమలాకర్, కోసూరి రాజ బాబు, మేకల బ్రహ్మం పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల డబ్బుల వసూళ్లపై విచారణ జరిపించాలి



ప్రజాపక్షం/నేలకొండపల్లి : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించా లని అమ్మగూడెం మాజీ సర్పంచ్ గండు జానయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామా నికి తొలి విడతలో మంజూరైన 11 ఇళ్లలో తన ఆధ్వర్యంలో ఎనిమిది మంది లబ్ధిదారులను ఎంపిక చేశానని, మిగతా ముగ్గురిని ఇతర నాయకులు ఎంపిక చేశారని తెలిపారు. తాను లబ్ధిదారుల నుంచి ఒక్క రూపాయి కూడా ఆశించలేదని స్పష్టం చేశారు. 40 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి నిస్వార్థంగా సేవ చేస్తున్న తనపై తప్పుడు ప్రచారం చేయడం బాధాకర మన్నారు. తనతో పాటు ఇతర నాయకుల ద్వారా ఎంపికైన లబ్ధిదారుల విషయంలోనూ విచార ణ జరిపించాలని కోరారు. విచారణలో తాను అవినీతికి పాల్పడినట్లు తేలితే చర్యలు తీసుకోవచ్చ ని, తనపై అసత్య ఆరోపణలు ఆపకపోతే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

క్రాప్ హాలిడే సరే.. రైతులకు పరిహారం ఏదీ..?

బీజేపీ నేత కొండపల్లి శ్రీధర్‌రెడ్డి



ప్రజాపక్షం/నేలకొండపల్లి : ఎల్‌నినో ప్రభా వంతో క్రాప్ హాలిడే ప్రకటించే ఆలోచనలో ఉన్న ప్రభుత్వం.. రైతులకు ఎలాంటి పరి హారం అందిస్తుందో స్పష్టం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం నేలకొండప ల్లిలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులను వ్యవసాయా నికి దూరం చేసే పరిస్థితులు నెలకొన్నాయని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని, ఓటర్ల జాబితాలో నకిలీ, డబుల్ ఓట్ల తొలగింపును ఓటు చోరీగా చిత్రీకరి స్తోందని ఆరోపించారు. పాలనను పక్కనపెట్టి రాజకీయాలకే ప్రాధాన్యమిస్తోందని విమర్శిం చారు. పట్టభద్రులు ఆలోచించి ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీకి మద్దతివ్వాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకుడు అనంతు ఉపేందర్ గౌడ్, మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్, చావా కిరణ్, మన్నె కృష్ణారావు, దివాకర్, సూరేపల్లి జ్ఞానరత్నం, మల్లెబోయిన గోవిందరావు, రామకృష్ణ, కందరబోయిన గోపి, సయ్యద్ మెహినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సర్వోత్తమ్‌రెడ్డి విజయానికి కృషిచేయాలి

జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి



ప్రజాపక్షం/చింతకాని : పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి రామిరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి విజయం కోసం కాంగ్రెస్ పార్టీ నాయకులు, బిఎల్‌ఎలు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్, మధిర నియోజకవర్గ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్య క్షుడు కన్నెబోయిన గోపి అధ్యక్షతన జరిగిన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడుతూ నవం బర్ 6వ తేదీలోగా అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్‌ను ఓటరుగా నమోదు చేయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వేజెండ్ల సాయి, నాయకులు మడిపల్లి భాస్కర్ , జోనల్ ఇంచార్జ్‌లు , నాయ కులు, పలువురు సర్పంచులు పాల్గొన్నారు.

పద్మనాభయ్యకు డాక్టర్ చంద్రావతి నివాళి

ప్రజాపక్షం/వైరా: సేంద్రియ వ్యవసాయరైతు దేవబత్తిని పద్మనాభయ్యకు వైరా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బాబోత్ చంద్రావతి మంగళవారం నివాళులర్పించారు. మండల పరిదిలోని ఖానాపురం గ్రామంలో సేంద్రియ వ్యవసాయరైతు పద్మనాభయ్య మృతిచెందాడు. ఆయన మృతదేహానికి ఆమె పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబసబ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమం లో ఆమె వెంట సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సబ్యులు బొంతు రాంబాబు, వైరా డివిజన్ కార్యదర్శి భూక్యావీరభద్రం, జడ్పీ మాజీ కోఆప్షన్ సబ్యులు షేక్ లాల్‌మహమ్మద్, వాసిరెడ్డి రవి, షేక్ మైసూర్, ఇలూరి భూపతిరెడ్డి, సునావత్ నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, షేక్ సోండ్‌సాహెబ్, షేక్ ఇబ్రహీం నివాళులర్పించారు.

కంపెనీలకు నీటి వరదలు



ప్రజాపక్షం/సత్తుపల్లిః పట్టణంలోని సర్వరాయ షుగర్స్ లో నీరు వరదలై పారుతూ, సీసాలను నింపి కోట్లను అందిస్తుండగా, మరోవైపు సింగరేణి భూమాతను చీల్చి చెండాడుతూ భూగర్భ జలాలు పడిపోవడానికి కారణం అవుతుండగా రెండు కంపెనీలు పోటాపోటీతో సత్తుపల్లి భూగర్భ జలాలను ఆగం పట్టిస్తుండగా ప్రజలకు మాత్రం గుక్కెడు త్రాగునీరు, పంట పొలాలకు బకెట్ సాగునీరు అందే పరిస్థితులు రానున్న రోజుల్లో కనిపించడం లేదని మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓవైపు ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు, సాగునీటి కొరతతో భూగర్భ జలాలు పడిపోతుంటే మరోవైపు పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో చెరువులు అడుగంటుతున్నాయి. ఫలితంగా సత్తుపల్లి పట్టణం తోపాటు పరిసర గ్రామాల్లో సాగు, తాగునీటి లభ్యతపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఇలాంటి తరుణంలో భారీగా నీటిని వినియోగిస్తున్న సర్వరాయ షుగర్స్, సింగరేణి సంస్థల నీటి వినియోగం, పర్యావరణ పరిరక్షణ చర్యలపై ప్రజల్లో ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

నీటితో వ్యాపారం.. ప్రజలకు మాత్రం దాహం...?

సర్వరాయ షుగర్స్ పరిధిలో భూగర్భ జలాల వినియోగం ఎంత నీటిని ఏ వనరుల నుంచి సేకరిస్తున్నారు...? అనుమతులు, నిర్దేశిత పరిమితులు పాటిస్తున్నారా...? స్థానిక బోర్లు, బావుల నీటి మట్టాలపై ప్రభావం ఏమైనా ఉందా..? అనే అంశాలపై అధికారులు సమగ్ర విచారణ జరపాలి. నీటిని వ్యాపార అవసరాలకు వినియోగిస్తున్న సంస్థ స్థానిక ప్రజల తాగునీటి సమస్య పరిష్కారానికి ఎలాంటి సహకారం అందిస్తోందో వెల్లడించాలని యువత ప్రశ్నిస్తుంది.

నల్లబంగారం కోసం ప్రకృతి వనరులపై ఒత్తిడి?

మరోవైపు సింగరేణి బొగ్గు గనుల కార్యకలాపాల ప్రభావంపై కూడా శాస్త్రీయ అధ్యయనం అవసరం. గనుల తవ్వకాలు, భూగర్భ జలాల తొలగింపు, నీటి మళ్లింపు వంటి అంశాలు స్థానిక జలవనరులపై ఎలాంటి ప్రభావం చూపుతున్నాయో నిపుణులు పరిశీలించాలి. గనుల నుంచి వెలువడే నీటిని శుద్ధి చేసి ప్రజోపయోగానికి వినియోగిస్తున్నారా? వర్షపు నీటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? అన్న వివరాలను సింగరేణి యాజమాన్యం ప్రజలకు తెలియజేయాలి.

ఎమ్మెల్యే జోక్యం చేసుకోవాలి..

ఎల్‌నినో, వర్షాభావం, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు నీటి సంక్షోభాన్ని తీవ్రతరం చేసే పరిస్థితుల్లో తాగునీటి సరఫరాకు తక్షణ కార్యాచరణ అవసరం. అదే సమయంలో పరిశ్రమల నీటి వినియోగం, భూగర్భ జలాల స్థాయిలు, గనుల ప్రభావంపై సంబంధిత శాఖలు సంయుక్తంగా అధ్యయనం చేసి వాస్తవాలను వెల్లడించాలి. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ జోక్యం చేసుకొని పట్టణ ప్రజలకు తాగునీటి భరోసా కల్పించడంతోపాటు నీటి వనరుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధి అంటే పరిశ్రమల లాభాలేనా..?

ప్రజల దాహం తీర్చడం కూడా బాధ్యత కాదా? నీటి కొరతకు నిర్దిష్ట సంస్థలే కారణమని శాస్త్రీయ ఆధారాలు లేకుండా తేల్చలేం. అయితే నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న ప్రాంతంలో భారీగా నీటిని వినియోగించే సంస్థల బాధ్యతను ప్రశ్నించడం ప్రజల హక్కు. నీటి వనరులను కాపాడుతూ స్థానిక ప్రజలకు తాగునీటి భరోసా కల్పించేలా ప్రభుత్వం, పరిశ్రమలు సమన్వయంతో ముందుకు రావాలి. రానున్న కరువు పరిస్థితుల నేపథ్యంలో పట్టణంలో వేల అడుగుల లోతులో నీటిని ఒడిసిపడుతున్న సర్వరాయ షుగర్ కంపెనీ తక్షణమే ఇప్పటినుండి నీటి తోడకాన్ని ఆపేసి భూగర్భ జలాలు పెరుగుదలకు మార్గాలు అన్వేషించాలని, ఇదే సందర్భంలో సింగరేణి సైతం ఆ దిశగా ఆలోచించి రానున్న రోజులలో కట్టిన తరం అంటున్న కరువును నీటి ఎద్దడి సత్తుపల్లి ప్రాంతాన్ని తాక కుండా చేయాలని మేధావులు,రాజకీయవేత్తలు విజ్ఞప్తి చేస్తున్నారు.

సర్వోత్తమరెడ్డిని కలిసిన పగడాల లచ్చిరెడ్డి



ప్రజాపక్షం/ తల్లాడ : కాంగ్రెస్ పార్టీ ఎంఎల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమరెడ్డిని తల్లాడ మండలంలోని రంగం బంజర గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పగడాల లచ్చిరెడ్డి మంగళవారం కలిశారు. ఖమ్మం నల్గొండ వరంగల్ పట్టభద్రుల ఎంఎల్సీ నియోజక వర్గం నుండి ఆయన పోటీ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లాలో పరిచయ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగా లచ్చిరెడ్డి ఆయనను కలిసి మర్యాదపూర్వకంగా పలు విషయాలను చర్చించారు. పగడాల లచ్చిరెడ్డి, రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుటుంబంతో పాటు మాజీ మంత్రి స్వర్గీయ రాంరెడ్డి వెంకటరెడ్డి, దామోదర్ రెడ్డి కుటుంబ సభ్యులతో మంచి స్నేహసంబంధాలు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఆ కుటుంబం నుండి పోటీ చేస్తున్న సర్వోత్తమరెడ్డిని ఆయన ప్రత్యేకంగా కలిసిమాట్లాడారు.అందరికీసుపరిచితుడైన సర్వోత్తమరెడ్డిని గెలిపించాలని లచ్చిరెడ్డి కోరారు.

ఎంఎల్సీ ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి



ప్రజాపక్షం/ తల్లాడ : ఖమ్మం నల్గొండ వరంగల్ పట్టభద్రుల నియోజక వర్గం నుండి ఎంఎల్సీ ఎన్నికల్లో రాంరెడ్డి సర్వోత్తమరెడ్డి గెలుపే ధ్యేయంగా ఓట్లు వేసేందుకు పట్టభద్రులందరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నారు. తల్లాడ మండల ఇంచార్జి మూడుముంతల గంగరాజు, తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొడుగునూరి లక్ష్మారెడ్డి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గోవింద్ శ్రీనివాసరావు, తల్లాడ మండల ఉపాధ్యక్షుడు తాళ్ల జోసెఫ్ లు కోరారు. సత్తుపల్లి శాసనసభ్యులు మట్టా రాగమయి దయానంద్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఆదేశాలతో మంగళవారం తల్లాడ మండలంలోని ఎంఎల్సీ ఓట్ల నమోదు కేంద్రాలను సందర్శించారు. మల్లవరంలో ఎంఎల్సీ ఓట్ల నమోదు కేంద్రంగా పరిధిలో ఉన్న గ్రామ ముఖ్య నాయకులతో నమోదు కేంద్రాన్ని సర్పంచ్ కటిక కిరణ్‌కుమార్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో మల్లవరం గ్రామ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు కృష్ణారావు, మల్లవరం గ్రామ పార్టీ అధ్యక్షులు సీతారామయ్య, తల్లాడ మండలం యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ రవీంద్ర, తల్లాడ మండల ఎస్టి సెల్ అధ్యక్షులు అంజయ్య, పట్టభద్రులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పచ్చదనం పెంపొందించడమే లక్ష్యం



ప్రజాపక్షం/వైరా: వైరాలో పచ్చదనం, పర్యావరణ పరిరక్షణను పెంపొందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వైరా 5వ వార్డు కౌన్సిలర్ కట్టా స్వరూపరాణి అన్నారు. వైరా పట్టణం 5వ వార్డులో మంగళవారం ఆమె మొక్కలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతు మొక్కలు మనిషి మనుగడకు ఎంతో అవసరం అని అన్నారు. స్వచ్ఛమైన గాలిని అందించడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించేందుకు మొక్కలు నాటి వాటిని పెంచడంలో బాధ్యత తీసుకోవాలని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలక ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే పచ్చదనం అవసరం అని స్పష్టంచేశారు. ప్రజలందరు వనమహోత్సవ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

వైరాలో మొక్కలు పంపిణీ



ప్రజాపక్షం/వైరా : తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ, గృహనిర్మాణ, సమాచార, పౌర సంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈరోజు జరుగుతున్న జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళవారం వైరా మూడోవార్డులో వైరా మాజీ జెడ్పీటిసి సబ్బు రాలు బొర్రా ఉమాదేవి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తిచేసుకున్న లబ్ధిదారులకు మొక్కలు పంపిణీచేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతు మొక్కలు నాటడంతోపాటు ప్రతిఒక్కరు మొక్కను బతికించి పెద్దచేసే బాధ్యతను తీసుకోవాలని అన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడుకొని భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు దోహదపడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఊరుకొండ సునీత, నాళ్ల లత, పంది శైలజ, పంది మానస, బొర్రా సదాలక్ష్మి, పర్సా పద్మావతి, త్రివేణి, పర్సా పద్మ, తోట బాలనాగమ్మ, ఉయ్యూరి కృష్ణకుమారి, అనంత సుజాత, పోతగాని నాగమణి, బి ఉమా, పర్సా రమాదేవి, గోంగూర జ్యోతి, ఊరుకొండ మాధవి, గూడూరు అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావేదిక ముగింపు.. రూ.83 వేల జరిమానా

-రికవరీకి రూ.22,407 ఆదేశం

ప్రజాపక్షం/నేలకొండపల్లి : మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (202526) పనులపై నిర్వహించిన ప్రజావేదిక ముగిసింది. గత నెల 19న 13 గ్రామపంచాయతీల్లో నిర్వహించగా, మిగిలిన 19 పంచాయతీల్లో మంగళవారం ప్రజావేదిక నిర్వహించారు. పనుల్లో గుర్తించిన తప్పిదాలకు సంబంధించి మండలవ్యాప్తంగా రూ.83 వేల జరిమానా విధించగా, క్షేత్ర సహాయకుల నుంచి రూ.22,407 రికవరీ చేయాలని అధికారులు ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్డీవో అదనపు పీడీలు శిరీష, శ్రీదేవి, ఎంపీడీవో ఎం.ఎర్రయ్య, ఏపీవో అమ్మాజాన్, ఈసీ శేషగిరి, అంబుడ్స్‌మన్ రమేష్, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావంపై గ్రామసభలు

-అభివృద్ధి పనుల పరిశీలన



ప్రజాపక్షం/ తల్లాడ : కుర్నవల్లి, బస్వాపురం గ్రామాల్లో ఎల్‌నినో ప్రభావంపై అవగాహన కొరకు ప్రత్యేక గ్రామసభలు మంగళవారం నిర్వహించారు. కుర్నవల్లి గ్రామంలో సర్పంచ్ ఎక్కిరాల శేషమ్మ అధ్యక్షతన బస్వాపురం గ్రామంలో ఉప సర్పంచ్ వార్డు పేటూరి నర్సింహారావు అధ్యక్షతన సమావేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డి, ఎంపిడివో శ్రీధర్‌రాజు, మండల వ్యవసాయ అధికారి తాజుద్దీన్, మిషన్ భగీరథ ఏఈ ఇరిగేషన్ ఏఈలు పాల్గొని ఎల్‌నినో ప్రభావం వల్ల కలిగే వాతావరణ మార్పులు, సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నీటి సంరక్షణ పద్ధతులపై రైతులకు గ్రామ ప్రజలకు వివరించారు. ఎంపిడివో శ్రీధర్‌రాజు కుర్నవల్లి గ్రామంలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించి, పనుల నాణ్యత, పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నాణ్యతలో రాజీపడవద్దని సిబ్బందికి తగు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, గ్రామ ప్రజలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సీతారామ, సీతమ్మసాగర్ ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయాలి



-స్థానిక రైతులకు నీరిచ్చాకే ఇతర ప్రాంతాలకు తరలించాలి

-తుమ్మలచెరువును 25 అడుగుల మేర నింపాలి: మచ్చా వెంకటేశ్వర్లు

ప్రజాపక్షం/అశ్వాపురం: సీతమ్మసాగర్ ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతులకు సాగునీటిలో ప్రాధాన్యత ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు డిమాండ్ చేవారు. మంగళవారం పార్టీ నాయకులతో కలిసి కుమ్మరిగూడెం ఆనకట్ట, మారెళ్లపాడు లిఫ్ట్ డెలివరీ పాయింట్, మొండికుంటలోని తుమ్మల చెరువును పరిశీలించి రైతుల సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రకటించినట్లు మూడు జిల్లాల్లో సుమారు ఏడు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టుల పనులు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయని ప్రశ్నించారు. కేంద్ర అనుమతులు, నిధుల కేటాయింపు, ప్రధాన, పంపిణీ కాలువల నిర్మాణంపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కోరారు. స్థానిక రైతులకు నీరందించకముందే ఇతర ప్రాంతాలకు నీటిని తరలించే ప్రతిపాదనలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యక్తిగత ప్రయోజనాలకు అనుగుణంగా నీటి తరలింపు ప్రణాళికలు రూపొందిస్తున్నారనే అనుమానాలపై ప్రభుత్వం, మంత్రి స్పష్టత ఇవ్వాలని సీపీఎం డిమాండ్ చేసింది. మొండికుంటలోని తుమ్మల చెరువును 25 అడుగుల మేర నింపితే రబీ పంటల సాగుకు ఉపయోగపడుతుందని తెలిపారు. స్థానిక రైతులకు ముందుగా నీరందించి, ఆ తర్వాత ఇతర ప్రాంతాలకు తరలించాలని కోరారు. డిస్ట్రిబ్యూటరీ కాలువల నిర్మాణం, భూసేకరణ, పెండింగ్ పనులపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రైతుల సాగునీటి హక్కుల కోసం సీపీఎం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య, రైతు సంఘం నాయకులు యలమంచి రవికుమార్, అన్నవరపు సత్యనారాయణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రేపాకుల శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యుడు గద్దర్ శ్రీనివాసరావు, మండల కార్యదర్శి పాయం నరసింహారావు, మండల కమిటీ సభ్యులు బద్దం సెంబిరెడ్డి, పి అశోక్‌రెడ్డి, దండి రాములు, సుధాకర్, వెంకన్న, రాఘవులు, తదితరులు పాల్గొన్నారు.